
ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

3



శ్రీపొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

సోమవారం 12 ఆగస్టు 2024

నిర్దిష్టమైన ప్రణాళిక.. కచ్చితంగా అమలు చేయగల సామర్థ్యం లేకపోతే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగుతాయో పిల్లల చేతికి మాజీ సీఎం జగన్ ఇచ్చిన ట్యాబ్‌లే నిదర్శనం. విమర్శకులు అన్నట్లు బైజూస్ సంస్థను బాగుపరచాలని చేశారో లేదా విద్యార్థుల బాగు కోసమే చేశారో తెలియదు కానీ వైసీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వల్ల మేలు కన్నా కీడే ఎక్కువ జరుగుతోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. 'ట్యాబ్‌ల కారణంగా మా పిల్లలు చెడిపోతున్నారు. వెంటనే వెనక్కు తీసుకోండి.' అంటూ ప్రధానోపాధ్యాయులకు లిఖిత పూర్వకంగా వినతి పత్రాలు ఇస్తున్నారు. ట్యాబ్‌లు వెనక్కి తీసుకోవాలని పీఆర్‌టీయూ వంటి ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయంటే ట్యాబ్‌ల అనర్థం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

- బడిపిల్లల భవిష్యత్తుపై జగన్ ట్యాబ్‌ల విష పడగ
- ట్యాబ్‌ల్లోకి డ్యూయల్ సిమ్‌లు.. వాటి ద్వారా నీలి దృశ్యాలు
- పెడదారి పడుతున్న భావిపౌరులు
- ట్యాబ్‌లు వెనక్కు తీసుకోమని తల్లిదండ్రులు, టీచర్ల వినతి



బైజూస్ పోయింది..
బూతు పురాణం వచ్చింది!?

నెల్లూరు (ఆంధ్రజ్యోతి), ఆగస్టు 11 : ప్రభుత్వ హైస్కూళ్లలో చదివే 8, 9 తరగతుల విద్యార్థులకు బైజూస్ ద్వారా నాణ్యమైన విద్యను అందించడం కోసం అన్నట్లు వైసీపీ ప్రభుత్వంలో ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర వ్యాప్తంగా 16వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేశారు. జగన్ పుట్టిన రోజు సందర్భంగా రెండు విడతలుగా హడావుడిగా విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేశారు. ట్యాబ్‌ల ద్వారా పాఠ్యాంశాలు అందించడానికి ఒక్కో విద్యార్థికి రూ.21 వేల చొప్పున బైజూస్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. జిల్లా పరిధిలో 2022-23 సంవత్సరాల్లో రెండు విడతలుగా మొత్తం 17,747 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు.

● ఆచరణలో ఘోర వైఫల్యం

ప్రచార ఆర్భాటం కోసం, ఏదో ఒక సంస్థకు లబ్ధి చేకూర్చడం కోసం ఉద్దేశించబడిన ఈ పథకంలో పిల్లల చేతికి ట్యాబ్‌లు అయితే ఇచ్చారు కానీ అవి దుర్వినియోగం కాకుండా చూసే విషయంలో గత వైసీపీ ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఈ ట్యాబ్‌ల వల్ల మేలు ఎంత జరిగిందో తెలియదు కానీ చెడు మాత్రం చాలా ఎక్కువగా జరిగిందని, జరుగుతోందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గగ్గోలు పెడుతున్నారు. ట్యాబ్‌లో రెండవ సిమ్ వేసుకునే విధంగా మరమ్మతులు చేసుకొని ఆ సిమ్ ద్వారా ఇంటర్నెట్ కనెక్టు చేసుకొని అశ్లీల దృశ్యాలు చూస్తున్నారు. అమ్మాయిలను ఫొటోలనూ షేర్ చేసుకొంటున్నారు. మొబైల్స్ మరమ్మతులు చేసే షాపుల్లో కాసింత డబ్బులు ఇస్తే ఈ ట్యాబ్‌లు ఇంటర్‌నెట్ కనెక్షన్‌కు, డ్యూయల్‌సిమ్‌కు అనుగుణంగా మార్పు చేసి ఇస్తున్నారు. దీంతో బైజూస్ పాఠ్యాంశాల మాటదేవుడెరుగు చదువు కాస్త కొండెక్కిపోతోందని, విద్యార్థులు చెడిపోతున్నారని పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ట్యాబ్‌ల్లో విద్యకు సంబంధించిన ఏ కంటెంట్ లేదు. ప్రభుత్వం మారడంతో బైజూస్ పాఠ్యాంశాలు ఆగిపోయాయి. కానీ జగనన్న జన్మదినం కానుక పేరుతో విద్యార్థుల చేతికి చేరిన ట్యాబ్‌లు ప్రస్తుతం పిల్లల భవిష్యత్తు వక్రమార్గం పట్టడానికి ఆయుధాలుగా మారుతున్నాయనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.



పిల్లల భవిష్యత్తు నాశనం

గత ప్రభుత్వం విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల వల్ల పిల్లలు నాశనం అయిపోతున్నారు. పిల్లలు నీలి చిత్రాలు చూస్తున్నారు. స్కూళ్లకు తీసుకొచ్చి తోటి విద్యార్థులతో కలిసి గుంపులు గుంపులుగా అశ్లీల దృశ్యాలను వీక్షిస్తున్నారు. మా పాఠశాలకు చెందిన పలువురు తల్లిదండ్రులు కూడా మాకు ఫిర్యాదు చేశారు. వెంటనే ట్యాబ్‌లు వెనక్కు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా కోరారు. ఈ ట్యాబ్‌ల వల్ల మంచి కన్నా చెడే ఎక్కువ జరుగుతోంది. వెంటనే వీటిని ప్రభుత్వం వెనక్కు తీసుకోవడం మంచిది.

- తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి పీఆర్టీయూ



విజ్ఞానం కన్నా.. వినాశనమే ఎక్కువ

విజ్ఞానం కోసం పిల్లలకు ట్యాబ్‌లు ఇచ్చామంటున్నారు. కానీ వాటి వల్ల వినాశనమే ఎక్కువ జరుగుతోంది. అధికారులేమో వాటిలో పాఠ్యాంశాలు తప్ప మరేమీ రావు, చూడలేరు అంటున్నారు. కానీ ఎలా చేస్తున్నారో ఏమో ట్యాబుల్లో అన్నీ వస్తున్నాయి. నీలి చిత్రాలు డౌన్‌లోడ్ చేసుకొంటున్నారు. చాటింగ్‌లు చేస్తున్నారు. పాఠాలు కూడా వినకుండా వీటిని పట్టుకొని ఏవేవో చేసుకొంటున్నారు. ఈ ట్యాబ్‌లను వెంటనే వెనక్కు తీసుకోవాలని ప్రస్తుత ప్రభుత్వానికి లేఖ రాశాం.

- బచ్చు డేవిడ్ చినబాబు, అధ్యక్షుడు, ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోషియేషన్, నెల్లూరు.



చదువు కొండెక్కిపోయింది

ఈ ట్యాబ్‌ల వల్ల ఉన్న చదువు కాస్తా కొండెక్కిపోతోంది. పిల్లలు స్కూళ్లలో పాఠాలు వినడం లేదు. ట్యాబ్‌ల్లో అశ్లీల చిత్రాలు చూస్తున్నారు. అమ్మాయిలను వివిధ భంగిమల్లో ఫొటోలు తీస్తున్నారు. పాఠశాలల వాతావరణమే నాశనం అయిపోతోంది. గొడవలు ఎక్కువ అవుతున్నాయి. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా వెంటనే వీటిని వెనక్కు తీసుకోవడం మంచింది.

- శ్రీరామశెట్టి వెంకటేశ్వర్లు,
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం

- భూసమస్యలపై ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- 45 రోజులపాటు గ్రామసభల ఏర్పాటుకు నిర్ణయం
- సమస్యల పరిష్కారానికి చర్యలు
- గత ప్రభుత్వంలో అనేక అక్రమాలు
- నాడు గ్రామసభలు లేకుండా భూముల ధారాదత్తం
- ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లకు బ్రేక్

వీడనున్న అక్రమాల గుట్టు

నెల్లూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పొదలకూరు మండలం భూఅక్రమాలకు నిలయంగా మారింది. ఆ గ్రామం, ఈ గ్రామం అనే తేడా లేకుండా అన్ని గ్రామాల్లోనూ భూరికార్డులను తారుమారు చేసి భారీఅవినీతికి పాల్పడ్డారు. ప్రభుత్వ భూమి అనేది లేకుండా కొట్టేశారు. ప్రభుత్వ భూములతో ఆగని అక్రమార్కులు.. ప్రైవేటు వ్యక్తుల భూములను కూడా చెరబట్టారు. సదరు భూమిపై నిజమైన హక్కుదారుడు ఉన్నప్పటికీ రికార్డుల్లో పేర్లు మార్చి ఉద్దేశపూర్వకంగా రికార్డులు మార్చి వివాదాలు సృష్టించారు. ఇలా చేసి తక్కువ ధరకు ఆ భూములను నొక్కేశారు. ఓ తహసీల్దార్ నిర్వాహకంతో వందలాది భూసమస్యల ఉచ్చులో ఇరుక్కున్నారు. ఆ తహసీల్దార్ పుణ్యమా అని ఒక్కో గ్రామానికి ఓ తహసీల్దార్‌ను విచారణాధికారులుగా నియమించి నాడు భూ అక్రమాలపై విచారణ జరిపించాల్సిన పరిస్థితి తలెత్తింది. అయితే ఈ నివేదికలేవీ నాడు బయటకు రాలేదు. ఆ తహసీల్దార్‌పై చర్యలు తీసుకున్నా ఆయన అవినీతితో ఉత్పన్నమైన సమస్యలు మాత్రం నేటికీ పరిష్కారం కాక రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రజలు కాళ్లరిగేలా తిరుగుతున్నారు.


● రూరల్‌లో భ్రష్టుపట్టిన రెవెన్యూ

రెవెన్యూ వ్యవస్థ భ్రష్టు పట్టిపోయిన మండలాల్లో నెల్లూరు రూరల్ మండలం ముందు వరుసలో ఉంటుంది. గత ప్రభుత్వంలో ఈ మండలంలో భూసమస్యలు అమాంతం పెరిగిపోయాయి. అధికారులు గ్రీవెన్స్ నిర్వహిస్తే ఎక్కువగా ఈ మండలం నుంచే భూసమస్యలు వచ్చేవి. ఈ క్రమంలో నెల్లూరు రూరల్ మండలం ఒక్కదానికే ప్రత్యేక గ్రీవెన్స్ ను కూడా నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. కొత్తూరు గ్రామంలో ఓ కుటుంబానికి చెందిన మూడెకరాల భూమిని కొందరు అక్రమార్కులు దొడ్డిదారిలో వేరొకరి పేరుపై మార్చేశారు. కొవిడ్ సమయంలో పోలీసులతో బెదిరించి పొజిషన్ కూడా లాక్కొన్నారు. అనంతరం ఆ భూమితోపాటు చుట్టుపక్కల భూములను కూడా కలుపుకొని అక్రమంగా లేఅవుట్ వేశారు. నాడు ఆ కుటుంబం ఉన్నతాధికారులను కలిసినా ఫలితం లేకపోయింది. న్యాయవ్యవస్థ ద్వారా విచారణ జరపాల్సి రావడంతో అసలు అక్రమాల పుట్ట బద్ధలైంది. మూడెకరాల కబ్జాపై ఆర్డీవో విచారణ జరపగా మొత్తం 27 ఎకరాలకు సంబంధించిన రికార్డులు మార్చేసి లేఅవుట్ వేసినట్లు నిర్ధారించారు. ఇలా నిర్ధారించి ఏడాది దాటినా ఇంతవరకూ ఈ అక్రమాలపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సాహసించలేదు. ఇలాంటివి రూరల్ మండలంలో అనేకం ఉన్నాయి.

గత ప్రభుత్వంలో పేదలు అనుభవించిన కష్టాలను గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం.. వాటి పరిష్కారానికి సంచలన నిర్ణయం తీసుకుంది. ఎన్నడూ లేనంతగా గత ఐదేళ్లలో భూసమ స్యలు అమాంతం పెరిగిపోయాయి. పేదలు, ప్రభుత్వ భూములే లక్ష్యంగా అక్రమార్కులు చెలరేగి పోయారు. అధికారం అండతో విచ్చలవిడిగా రికార్డులు మార్చేసి భూములను చెరబట్టారు. ఏళ్ల తరబడి కాళ్లరిగేలా బాధితులు తిరిగినా ఏ ఒక్క అధికారి కూడా పట్టించుకున్న పాపాన పోలేదు. అలాంటి భూసమస్యలను పరిష్కరిం చేందుకు గ్రామసభలు నిర్వహించాలని తాజాగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

● 15 నుంచి గ్రామసభలు

ఈనెల 15 నుంచి ఈ బృహత్తర కార్యక్రమం మొదలుకా నుంది. 45 రోజులపాటు అధికార యంత్రాంగం ప్రజల ముంగిటకు వెళ్లనుంది. ఏ రోజు ఏ గ్రామంలో గ్రామసభలు నిర్వహించేది రెవెన్యూ అధికారులు ముందుగానే తెలియజేస్తారు. తహసీల్దార్, ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్‌తో పాటు మండల నోడల్ అధికారి గ్రామ సభల్లో పాల్గొంటారు. జిల్లా ఉన్నతాధికారులు, జిల్లాస్థాయి నోడల్ అధికారి గ్రామసభ లను పర్యవేక్షిస్తారు. అన్నీ రకాల భూ సమస్యలకు సంబంధించిన అర్జీలను ఈ సభల్లో స్వీకరిస్తారు. అక్కడికక్కడే పరిష్కార మయ్యే సమస్యలను వెంటనే పరిష్కరిస్తారు. మిగిలిన వాటిని 45 రోజుల్లో పరిష్కరించేలా ప్రణాళిక రూపొందించారు. భూకబ్జాలు, ఆక్రమణలు, రికార్డులు తారుమారు చేయడం వంటి సమస్యలతో పాటు రీసర్వేతో వచ్చిన సమస్యలను కూడా ఈ గ్రామసభల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లవచ్చు. అర్జీలు తీసుకున్నామా.. వదిలేశామా.. ? అని కాకుండా ప్రతీ సమస్యను లోతుగా పరిశీలించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.




పరిష్కారం దిశగా కూటమి ప్రభుత్వం

● గ్రామసభలు లేకుండా ధారాదత్తం

వైసీపీ ప్రభుత్వం గ్రామసభలు లేకుండానే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీతోపాటు ఫ్రీహోల్డ్ హక్కులను కల్పించింది. చుక్కల భూముల మాటున ప్రభుత్వ భూములను కూడా ఆ జాబితా నుంచి తొలగించి భారీ భూకుంభకోణాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఓ వ్యక్తికి అసైన్‌మెంట్ పట్టా ఇస్తున్నా లేక 20 ఏళ్ల దాటిన వారికి ఫ్రీహోల్డ్ హక్కు కల్పిస్తున్నా ముందుగా గ్రామసభ నిర్వహించాల్సి ఉంది. అప్పుడే నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుంది. కానీ అలాకాకుండా అత్యంత గోప్యంగా ఈ ప్రక్రియలు గత ప్రభుత్వంలో జరిగాయి. ఒక గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని ఆ గ్రామంలోని పేదలకు కాకుండా, వారికి తెలియకుండానే మరో గ్రామానికి చెందిన భూస్వామికి కట్టబెట్టారు. 20 ఏళ్లపాటు ఒరిజినల్ అసైనీదారులు సాగు చేయక పోయినా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. ఇలా ఏ గ్రామంలో ఎవరికి భూ పంపిణీ చేశారు..? ఎవరికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు..? అన్నది ఆయా గ్రామస్థులకు కూడా తెలియదు. దీంతో ఈ అక్రమాల బాగోతాన్ని బద్ధలు కొట్టేందుకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. అప్పటి వరకూ ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని రిజిస్ట్రేషన్‌శాఖను ఆదేశించింది.

17న ఉప రాష్ట్రపతి రాక



నెల్లూరు(హరనాథపురం); ఆగస్టు 11: ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్ ఈనెల17న జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ ఆనంద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 17న ఉదయం 8.35 గంటలకు హైదరాబాద్‌లోని షంషాబాద్ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9.40 గంటలకు రేణిగుంటకు చేరుకుంటారు. 9.50గంటలకు అక్కడి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 10.30 గంటలకు నెల్లూరులోని పోలీసు పరేడ్ మైదానానికి చేరుకుంటారు. 10.50 గంటలకు అక్కడి నుంచి వెంకటాచలంలోని అక్షర విద్యాలయానికి చేరుకుంటారు. అక్కడ స్వర్ణభారత్ ట్రస్టు ఏర్పాటు చేసిన వివిధ కార్యక్రమాల్లో ఉప రాష్ట్రపతి పాల్గొంటారని కలెక్టరు వివరించారు. తదుపరి రేణిగుంటకు బయలుదేరుతారని ఆయన పేర్కొన్నారు.

నెల్లూరులో భారీ చోరీ

- 381 గ్రాముల బంగారు, 1,230 గ్రాముల వెండి, రూ.15 వేల నగదు అపహరణ
- తాళం వేసిన ఇంట్లో దొంగల బీభత్సం
- నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీలో ఘటన

నెల్లూరు(క్రైం), ఆగస్టు11: నెల్లూరు నగరంలో ఇంటికి తాళం వేసి ఉన్నారా..? అయితే మీ ఇల్లు గుల్లయినట్లే. ఇటీవల నగరంలో వరుసగా జరుగుతున్న చోరీల బట్టి చూస్తే ఈ భావన కలుగుతుంది. ఈ క్రమంలోనే నగరంలోని నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీలో ఆదివారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో దుండగలు చొరబడి రూ.23 లక్షల విలువ చేసే సొత్తును దోచుకెళ్లారు. పోలీసుల కథనం మేరకు, నవాబుపేట ఎఫ్‌సీఐ కాలనీలో సుప్రియ, జోసఫ్ దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు సంతానం, సుప్రియ తిక్కవరప్పాడులో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. జోసఫ్ నగరంలోని ఓ ప్రైవేటు ఆర్థోపెడిక్ వైద్యశాలలో అసిస్టెంట్ డాక్టర్ గా పనిచేస్తున్నారు. తిరుపతి జిల్లా వాకాడు మండలం తూపిలిపాలెం జోసఫ్ సొంతూరు. తల్లి అనారోగ్యంగా ఉందని తెలిసి శనివారం రాత్రి దంపతులిద్దరూ ఇంటికి తాళం వేసి తూపిలిపాలెం వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. బీరువా లాకర్ తెరిచి అందులో ఉన్న రూ.23 లక్షలు విలువ చేసే 381 గ్రాముల బంగారు, 1,230 గ్రాముల వెండి వస్తువులు, రూ.15 వేల నగదు, ఇంటి వరండాలో పార్క్ చేసి ఉన్న బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఆదివారం ఉదయం సమీప బంధువు ఇంటికి వచ్చి చూడగా, తాళాలు తెరిచి ఉన్నాయి. ఈ సమాచారాన్ని ఆయన సుప్రియ తల్లి, అన్నలకు తెలియజేయగా వారు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ ఘటనపై సుప్రియకు సమాచారం అందించారు. బాధితురాలు హుటా హుటిన నెల్లూరుకు చేరుకుని బీరువాలోని లాకర్‌ను పరిశీలించగా బంగారు, వెండి ఆభరణాలు, నగదు, వరండాలో ఉన్న బైక్ కన్పించలేదు. ఈ ఘటనపై బాధితులు నవాబుపేట పోలీసులకు సమాచారం ఇచ్చారు. నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి, నవాబుపేట ఇన్‌స్పెక్టర్ అన్వర్ బాషాలు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలి ముద్రలను సేకరించింది. సుప్రియ ఫిర్యాదు మేరకు నవాబుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

తాత్కాలికంగా ఇసుక అమ్మకాల నిలిపివేత

మర్రిపాడు, ఆగస్టు 11: స్థానిక యార్డులో అధికారులు ఆదివారం నుంచి ఇసుక అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేశారు. సోమశిల జలాశయం వద్ద జరగబోయే అప్రాన్ పనులకు ఇసుక అవసరం కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో మర్రిపాడు రీచ్ నుంచి 20వేల మెట్రిక్ టన్నులను సోమవారం నుండి అక్కడికి సరఫరా చేస్తున్నట్లు తహసీల్దారు స్వప్న తెలిపారు. రీచ్‌ను ఆమెతోపాటు మైనింగ్ అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం రీచ్‌లో 43వేల మెట్రిక్ టన్నులు ఇసుక ఉండగా సోమశిలకు పంపిన అనంతరం మిగిలిన ఇసుకను యథావిధిగా అమ్మకాలు జరుపుతామని తెలిపారు. ఈ నిర్ణయంతో శనివారం సాయంత్రం వరకు ఇసుక కొనుగోలు చేసి, నగదు చెల్లించిన 120 టిప్పర్లు లోడింగ్ కోసం ఎదురు చూశాయి. లోడింగ్ కాక డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు.



రీచ్ వద్ద బారులు దీరిన టిప్పర్లు

20 నుంచి కొత్త ఓటర్ల నమోదు

● ఎన్‌రోల్‌కు సిద్ధమవుతున్న జిల్లా యంత్రాంగం

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11: జిల్లాలో కొత్త ఓటర్ల నమోదుకు అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. ఈనెల 20 నుంచి కొత్త ఓటర్ల నమోదుకు, పాత ఓటర్ల జాబితాలో సవరణలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. దీని ప్రకారం కొత్త ఓటర్ల నమోదు ఈ సారి ముమ్మరంగా సాగనున్నది. ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటే వజ్రాయుధం. ఓటును వినియోగించుకుని తమకు నచ్చిన వారిని పాలకులుగా ఎన్నుకొనే అవకాశం మనకుంది. మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్నప్పుడే ప్రజా సమస్యలు తీరుతాయి. సక్రమంగా పనిచేయని వారిని అధికార పీఠం నుంచి దించేయడానికి కూడా ఓటే కీలకం. కొత్త ఓటరుగా నమోదు కావటం, పాత ఓటర్ల జాబితాలో సవరణ కార్యక్రమం నిరంత ప్రక్రియ. ఈ కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నారు.

● ఇంటింటి సర్వే

ఈనెల 20వ తేదీ నుంచి బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల నమోదు చేపట్టనున్నారు. వచ్చే ఏడాది జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండేవారు కొత్తగా ఓటరుగా చేరవచ్చు. యువత ఓటు హక్కు నమోదుకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహించనున్నారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ అధికారిని వివరణ కోరగా ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయని, పూర్తి వివరాలు పరిశీలించి తెలియచేస్తామన్నారు.





జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయం

అడుగడుగునా ఆటంకాలే !

- జిల్లాలో అలుముకున్న క్రీనీడలు
- చలనం లేని క్రీడారంగం
- ఏడాదిగా వేతనాల కోసం గగ్గోలు
- పట్టించుకోని అధికారులు

నెల్లూరు (విద్య), ఆగస్టు 11: జిల్లాలో క్రీడారంగానికి క్రీనీడలు అలుముకున్నాయి. దీంతో కొన్నేళ్లుగా చలనం లేకుండా ఉంది. అడుగడుగునా క్రీడాకారులకు ఆటంకాలు ఎదురవుతున్నా పట్టించుకునేవారు లేకుండాపోయారు. భావిభారత క్రీడాకారులను తయారుచేసే జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ(డీఎస్‌ఏ)లో పలు క్రీడాంశాలు అందుబాటులో ఉన్నాయి. అయితే ఐదేళ్లుగా కనీసం చెప్పుకోదగిన క్రీడాంశాల నిర్వహణ కానీ, పతకాల సాధన కానీ ఏమీలేవు. గత వైసీపీ ప్రభుత్వంలో క్రీడలను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో కోలుకోలేని క్రీడారంగం, నేటికీ అడుగడుగునా ఆటంకాలను ఎదుర్కొంటోంది. ఏడాదికి పైగా డీఎస్‌ఏలో పనిచేసే కోచ్‌లు, సిబ్బందికి సైతం జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

● జీతాలివ్వండి మహాప్రభో...

డీఎస్‌ఏలో పనిచేసే కోచ్‌లు, సిబ్బందికి గత 9 నెలలుగా వేతనాలు అందడం లేదు.దీంతో ఆయా సిబ్బంది, కుటుంబాలు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గతంలో ఎంతో వైభవంగా ఉన్న క్రీడారంగం నేడు చీకట్లలో మగ్గిపోతున్నదని సీనియర్ క్రీడాకారులు, క్రీడాభి మానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్‌ఏలో అన్ని వసతులు అందుబాటులో ఉన్నా వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవడం లేదు. దీంతో కొన్ని క్రీడాంశాల పరికరాలు, క్రీడాకారుల వసతి గృహాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. కొన్ని క్రీడాంశాల్లో మాత్రం మొక్కుబడిగా నిర్వహిస్తుం డడంతో ఆసక్తి కలిగిన క్రీడాకారులు మాత్రం సాధన చేస్తు న్నారు. డీఎస్‌ఏలోని కోచ్‌లు నిత్యం సంబంధిత క్రీడల్లో శిక్షణ అందించాల్సి ఉండగా, వారికి కూడా ఫొటోల అప్‌లోడ్, యాప్‌లలో సాధించిన ప్రగతిని ఉదయం, సాయంత్రం తెలియచేయాలని ఆదేశాలివ్వడం, క్రీడాకారుల వద్ద నుంచి కూడా ఫీజులు వసూలు చేయమనడం, పాఠశాలలు, కళాశాలలకు తిరిగి క్రీడాకారుల నుంచి నగదు వసూలు చేసి స్టేడియానికి వచ్చేలా చూడాలని ఆదేశించడం లాంటి పనులతో క్రీడలకు గ్రహణం పట్టేలా చేశారు. ఈ పరిస్థితి నేటికీ కొనసాగుతుండడం పలు విమర్శలకు తావిస్తోంది..

నిరుత్సాహంతో క్రీడాకారులు

క్రీడల్లో రాణించాలన్న ఆసక్తి, పట్టుదల ఉన్నా సరైన ప్రోత్సాహం, సదుపాయాలు లేక జిల్లాలోని క్రీడాకారులు నిరుత్సాహంతో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం క్రీడారంగాన్ని చిన్నచూపు చూడడం, నిధులు విడుదల చేయకపోవడంతో క్రీడారంగం నిర్వీర్యమైంది. ఆసక్తి ఉంది కదా.. నేర్చుకుందాం.. ఆడేద్దాం... అని అనుకుంటే గత జగన్ పాలనలో ఆటకు ధర చెల్లించాల్సిందే. ఎవరైనాసరే ఆడాలనుకున్నా, శిక్షణ పొందాలనుకున్నా అడ్మిషన్ ఫీజుతోపాటు నెలవారీ నగదు చెల్లిస్తేనే మైదానంలోకి ప్రవేశం ఉంటుందని నిబంధన పెట్టారు. డీఎస్‌ఏకు సంబంధించిన ఇండోర్ లేదా అవుట్‌డోర్ స్టేడియాల్లో అడుగు పెట్టాలన్నా, ఆటలు ఆడాలన్నా ఇకపై నగదు కచ్చితంగా చెల్లించాలంటూ రాష్ట్ర క్రీడాప్రాధికా రసంస్థ(శాప్) ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఎంతో మంది పేద, మధ్యతరగతి క్రీడాకారులు నగదు చెల్లిం చలేక క్రీడలకు దూరమయ్యారు. నాటి నుంచి నేటి వరకు కూడా ఇదే పరిస్థితి. క్రీడల్లో అత్య ధికులు గ్రామీణ ప్రాంతపేదలే ఉంటారు. గతంలో వీరంతా కూడా ఒక్క పైసా కూడా చెల్లించకుండానే క్రీడాకారులుగా రాణించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావ డంతో నిబంధనల్లో ఏమైనా మార్పులు రాకపోతాయా ? అన్న ఆశతో క్రీడాకారులు ఎదురు చూస్తున్నారు.

● కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

ఎంతోమంది అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులకు నిలయమైన జిల్లాలో క్రీడలకు పూర్వ వైభవం తీసుకువచ్చేలా కూటమి ప్రభుత్వం క్రీడారంగంపై దృష్టి సారించాల్సి ఉందని సీనియర్ క్రీడాకారులు అంటున్నారు. గత ప్రభుత్వం నిర్వహించిన మొక్కుబడి క్రీడలు, పే అండ్ ప్లే విధానాలకు స్వస్తి పలికి క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

కారు బోల్తా పడి నెలూరువాసి మృతి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: బండకిందపల్లి సమీపంలోని 167-బీజీ జాతీయ రహదారిలో ఆదివారం కారు బోల్తాపడి వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివ రాల మేరకు.. నెల్లూరు చిన్నబజార్‌లో బంగారు దుకాణం నిర్వ హించే హర్షవర్ధన్ (35) దుత్తలూరు నుంచి కావలి మార్గంలో వెళుతున్నాడు. కారు అతివేగంగా నడపడంతో అదుపుతప్పి చెట్లలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వివరాలు ఇంకా పూర్తిగా తెలియాల్సి ఉందన్నారు. కాగా కారులో ఉన్న బంగారు ఆభరణా లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సమాచారం తెలుసు కున్న ఉదయగిరి సీఐ వేల్పుల గిరిబాబు, ఎస్‌ఐ ఉమాశంకర్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన హర్షవర్ధన్

చికిత్స పొందుతూ డ్రైవర్..

మనుబోలు, ఆగస్టు 11: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ట్రాక్టర్ డ్రైవర్ రాపూరు బుజ్జయ్య (62) ఆదివారం నెల్లూరులో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. తోటపల్లి గూడూరు మండలం సౌత్‌ఆములూరు గ్రామానికి చెందిన ఆయన కట్టువపల్లిలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం పనుల నిమిత్తం గూడూరుకు ట్రాక్టర్‌లో వెళ్లి తిరుగు ప్రయాణంలో కట్టువపల్లికి వస్తుండగా వెంకన్నపాళెం మలుపు వద్ద అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కడప జిల్లావాసి ..

రాపూరు (డక్కిలి), ఆగస్టు 11: పెనుబర్తి సమీపంలోని ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కడప జిల్లా పెనగలూరుకు చెందిన నరసింహారావు (37) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఆయన తన స్వగ్రామం నుంచి ద్విచక్ర వాహనంలో కుమారుడు (7)తో కలిసి కలువాయి మండలం చిన్నగోపవరంలో కూతురు డెలివరీ కావడంతో చూసేందుకు వెళుతు న్నాడు. ఈయన్ను రాపూరు నుంచి గోనుపల్లి వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసింహరాజుకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఆయన కుమారుడికి స్వల్పగాయాయ్యాయి. వీరిని 108 వాహనంలో రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నరసింహారావు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

భార్యను కాపురానికి పంపలేదని

మామను హతమార్చాడు

నెల్లూరు,(క్రైం),ఆగస్టు11: భార్యను కాపురానికి పంపలేదన్న కోపంతో పిల్లనిచ్చిన మామను అల్లుడు కత్తితో పొడిచి చంపాడు. ఈ సంఘటన నెల్లూరు నగరం నడిబొడ్డులోని ఓ హోటల్ ఎదురుగా ఆదివారం రాత్రి జరగింది. పోలీసుల కథనం మేరకు, మూడవమైలు ప్రాంతానికి చెందిన ఆసీఫ్ (60) తన మొదటి కుమార్తెను రంగనాయకులపేటకు చెందిన రఫీకి ఇచ్చి వివాహం చేశాడు. అయితే భార్యభర్తల మధ్య వివాదాలు చోటుచేసుకోవడంతో భర్తను విడిచిపెట్టి రెండు నెలల కిందట తండ్రి వద్దకు కుమార్తె వచ్చింది. అప్పటి నుంచి రఫీ తన భార్యను కాపురానికి పంపాలని మామను కోరుతూ వచ్చాడు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. ఆదివారం కూడా మళ్లీ కోరాడు. మామ అంగీకరించలేదు. దీంతో నగరంలోని ఓ హోటల్ ఎదురుగా పూలు అమ్ముతున్న ఆసీఫ్‌ను రఫీ కత్తితో పొడిచాడు. దీంతో ఆసీఫ్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	101
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6644
వెండి కిలో ధర	రూ. 82,300
వెండి ఒక గ్రాము	రూ. 84.30



సచివాలయంగా మారిన బీరంగుంట పంచాయతీ కార్యాలయం

కుంటుపడిన అభివృద్ధి

- పన్నులు వసూళ్లు కాక సాగని పనులు
- పంచాయతీలకు రూ.లక్షల్లో బకాయిలు
- సచివాలయాలుగా మారడంతో మరింత నిర్లక్ష్యం

అల్లూరు, ఆగస్టు 11 : గ్రామ పంచాయతీల నిర్వహణకు, గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వివిధ రకాల పన్నుల వసూళ్లు ఉన్నాయి. ఇవి సక్రమంగా వసూలు కాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడింది. దీంతో ప్రతీ పంచాయతీ కూడా ఏదో రకంగా ప్రభుత్వ నిధులపై ఆధారపడి నిర్వహణ కొనసాగించాల్సి వస్తోంది. ఫలితంగా పారిశుధ్య సిబ్బందికి ప్రతీ నెలా క్రమం తప్పకుండా జీతాలు కూడా ఇవ్వలేని దయనీయ నెలకొంది. గతంలో కీలకపాత్ర పోషించిన పంచాయతీలు కాస్తా సచివాలయాలుగా మార్పు చెందడంతో అభివృద్ధి పూర్తిగా పడకేసింది. పంచాయతీ అధికారులన్నా, చట్టాలన్నా ఏమాత్రం స్పందించేవారు కరువయ్యారు. దీంతో ఒక్కొక్క పంచాయతీలో రూ.లక్షల్లో పన్ను బకాయిలు ఉండిపోతున్నాయి.

● జిల్లాలో పంచాయతీల నిర్వీర్యం

ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 940 పంచాయతీల్లో ఈ పరిస్థితి నెలకొని ఉంది. ఆదాయ వనరులు తక్కువ కావడం, నిర్వహణ అధికమవడం పంచాయతీ ఆర్థిక పరిస్థితిని దిగజార్చేందుకు కారణమవుతోంది. పంచాయతీల్లో ఇప్పటివరకు ఇంటిపన్నులు, నీటి పన్నులు, మార్కెట్ పన్నులు మాత్రమే వసూళ్లు అవుతున్నాయి. అవికూడా మందగొడిగా సాగుతున్నాయి.

● వసూలు చేయాల్సిన పన్నులు

పంచాయతీ పరిధిలో ఇంటిపన్ను, ప్రకటనలు, కొలగారం, కాటారుసుము, ప్రత్యేక పన్నులు వసూలు చేయాలి. పంచాయతీ భూములు, ఖాళీస్థలాలు తదితర వాటిపై కూడా పన్నులు వసూలు చేసే అధికారం పంచాయతీకి ఉంది. ఇవేకాకుండా లైసెన్సు ఫీజులు, లేఅవుట్ ఫీజులు, భవన నిర్మాణ ఫీజులు, నీటి కుళాయి, సంతలు, వ్యవసాయాధారిత ఉత్పత్తులపై పన్నులు, మాంసం, ఇతర వ్యాపారాలపై పన్నులు, వినోదపు పన్నులు కూడా విధించి పంచాయతీకి ఆదాయాన్ని రాబట్టుకోవచ్చు. కొలగారం ఆధారంగా ఉత్పత్తి చేసే వస్తు పరిమాణాన్ని బట్టి పన్ను విధించవచ్చు. ఉదాహరణకు ఇటుక బట్టీలు నిర్వహణలో ఒక్కొక్క ఇటుక పరిమాణాన్ని బట్టి పన్ను విధించవచ్చు. కాటారుసుము ఆధారంగా ఉత్పత్తి అయ్యే వాటి తూకాన్ని బట్టి పన్నులు విధించవచ్చు. ఈ రెండింటి ద్వారా వచ్చే ఆదాయంతో పంచాయతీ నిర్వహణ దాదాపు 50 శాతం ఎటువంటి అవరోధాలు లేకుండా కొనసాగుతోంది. అయితే వీటిలో ఇంటిపన్ను మాత్రమే కొంతమంది చెల్లిస్తున్నారు. అదికూడా ప్రతీ పంచాయతీలో 40 శాతం కంటే మించడం లేదు.

● పంచాయతీకి ప్రత్యేక నిధులు

జిల్లా తాగునీటి, పారిశుధ్య కమిటీ చైర్మన్‌గా జిల్లా కలెక్టరు వ్యవహరిస్తుంటారు. ఈ కమిటీ ద్వారా ఏడాదికి ప్రతీ పంచాయతీకి రూ.10 లక్షలు జమ అవుతుంటాయి. వీటిని పారిశుధ్య పరిశుభ్రతకు ఉపయోగించాలి. ఎస్‌ఎఫ్‌సీ ద్వారా రూ.10 లక్షలు పంచాయతీలకు జమ చేస్తుంది. అయితే ఈ నిధులు గత నాలుగేళ్లుగా జమ కావడం లేదు. ఇవేకాకుండా ప్రోత్సాహక నిధులు, కేంద్ర ఆర్థిక సంఘం నిధులు అధికంగా పంచాయతీలకు ఇవ్వాలి. పంచాయతీలకు వివిధ మార్గాల్లో ఆదాయాలు సమకూరేలా ఉన్నా, గత ప్రభుత్వంలో నిధుల మళ్లింపు, పన్నుల వసూళ్లలో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించడంతో పంచాయతీల నిర్వహణ కుంటుపడుతోంది



నగర పంచాయతీలో కలిపి నాశనం చేశారు..

నాలుగేళ్ల క్రితం సింగపేట పంచాయతీగా ఉన్న తమ గ్రామాన్ని అల్లూరులో కలిపి నాశనం చేశారు. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని సంబంధిత అధికారులు తమ ఇష్టారాజ్యంగా పన్నులు విధించడంతోపాటు అప్పటి పాలకులు చేతివాటం చూపించారు. పంచాయతీకి దక్కాల్సిన నిధులు దక్కితే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుంది.

- అరగల రమణయ్య, సింగపేట, అల్లూరు మండలం

పంచాయతీలను నిర్వీర్యం చేశారు..



గత ప్రభుత్వంలో పంచాయతీ వ్యవస్థను తొలగించి సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారు. అప్పటి పన్నుల వసూళ్లు మందగించాయి. సర్పంచి సైతం అధికారాన్ని కోల్పోయి పన్నుల వసూళ్లపై దృష్టి సారించలేదు. ఈ పరిస్థితుల్లో పంచాయతీలో అభివృద్ధి చెందాలంటే జరిగే పని కాదు.

- గుంజి రుద్రయ్య, నార్తుఆములూరు, అల్లూరు మండలం

నేడు డయల్ యువర్ డీఎం

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు11: ఆర్టీసీ నెల్లూరు-2 డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం, సలహాల కోసం సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆ డిపో మేనేజర్ శివశంకర్ యాదవ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు 995922 5642 నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు, సలహాలు తెలియజేయవచ్చని తెలిపారు.

పెంచలకోనలో నృసింహుడికి కల్యాణ నిర్వహిస్తున్న అర్చకులు



కమనీయం నృసింహుడి కల్యాణం

రాపూరు(డక్కిలి), ఆగస్టు 11: స్వాతినక్షత్రం పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివా రం వేద మంత్రోచ్ఛరణ, బాజభజంత్రీల మధ్య నిర్వహించిన పెంచలకోన ఆదిలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత నృసింహస్వామికల్యాణం కమనీయంగా సాగింది. కల్యాణంను తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో కోనకు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పెంచలకోన రద్దీగా మారింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు చేసి కల్యాణ విశిష్టతను భక్తులకు వివరించారు. ఉదయం 4గంటలకు స్వామి వారికి అభిషేకం, సాయంత్రం 6గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎసి సాగర్‌బాబు ఏర్పాట్లును పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ నారాయణ పాల్గొన్నారు.



కల్యాణానికి హజరైన భక్తులు

సంఘాలుగా ఏర్పడి పథకాలు, సబ్సిడీలు పొందండి

- కేవీకే సమన్వయకర్త లలితా శివజ్యోతి

నెల్లూరు(వ్యవసాయం): రైతులు ఉత్పత్తిదారుల సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం అందించే పథకాలను, సబ్సిడీలను పొందాలని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) సమన్వయకర్త డాక్టర్ లలితాశివజ్యోతి సూచించారు. బయో ఫోర్టిఫైడ్, వాతావరణ స్థితిస్థాపక రకాలైన దాదాపు 109 పంట రకాలను ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా మండలి హెడ్‌క్వార్టర్స్‌లో ఆదివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. మోదీ సందేశాన్ని నెల్లూరు కేవీకేలో లైవ్ స్ట్రీమింగ్ ద్వారా రైతులకు చూపించారు. రబీలో నెల్లూరుకు అనువైన వరి, మినుము, శెనగ, నువ్వుల రకాలను రైతులకు వివరించారు. అలాగే వేరుశనగ, నిమ్మలో విలువ ఆధారిత పదార్థాలు తయారు చేసుకునే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు లోకేష్‌బాబు, కిరణ్‌కుమార్‌రెడ్డి, సుజాత, పాల్గొన్నారు.

పోటాపోటీగా

కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ ఎన్నికలు

- జిల్లా అధ్యక్షుడిగా ప్రదీప్‌కుమార్ ఎన్నిక

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 11 : ది నెల్లూరు జిల్లా కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్య క్షుడిగా పేరూరి ప్రదీప్ కుమార్ భారీ మెజారి టీతో గెలుపొందారు. ఆ సంఘం ఎన్నికలు నగరంలోని ది ఐరన్ హార్డ్‌వేర్, పెయింట్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం హోరాహోరీగా జరిగాయి. కార్యదర్శి, కోశాధికారితోపాటు కమిటీ ఎన్నిక ఏకగ్రీవంకాగా ఒక్క జిల్లా అధ్యక్ష పదవికి మాత్రమే పోటీ జరిగింది. మొత్తం జిల్లాలో 745 ఓట్లు ఉండగా 438 పోలయ్యాయి. ఇందులో ప్యానెల్- 1 తరపున జిల్లా అధ్యక్షుడిగా పోటీ చేసిన అజయ్ కుమార్‌కు 121 ఓట్లు వచ్చాయి. ప్యానెల్-2 నుంచి పోటీ చేసిన పేరూరి ప్రదీప్ కుమార్‌కు 312 ఓట్లు వచ్చాయి. దీంతో ప్రదీప్ విజయం సాధించారు. ఆయన మూడేళ్ల పదవిలో కొనసాగుతారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా నరేంద్రబాబు, కోశాధికారిగా వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. వీరిని అసోసియేషన్ సభ్యులు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ ఎన్నికలకు పరిశీలకులుగా హిందూపురానికి చెందిన డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, కార్యదర్శి రాముగుప్తా వ్యవహరించారు. ఎన్నికల అధికారులుగా శ్రీనివాసరావు, పాపిశెట్టి పనిచేశారు.



గెలుపొందిన ప్రదీప్‌తో కమిటీ నేతలు

ఎస్సీ మోర్చాను బలోపేతం చేయాలి

- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు దేవానంద్


నెల్లూరు,(స్టోన్‌హౌస్‌పేట), ఆగస్టు 11: ఎస్సీ మోర్చాను మండల, జిల్లా స్థాయి కమిటీలతో పూర్తి నిర్మాణం చేసి రాబోయే రోజుల్లో బలమైన శక్తిగా తయారు చేయాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ పిలుపునిచ్చారు. నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎస్సీ మోర్చా కోస్టల్ జోనల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న దేవానంద్ మాట్లాడుతూ బీజేపీ జాతీయ నాయకత్వం పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా, అమ్మకోసం ఒక చెట్టు కార్యక్రమాలను ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మండలాల్లో నిర్వహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు పరుసు మధు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి పేముల మోజెస్, జోనల్ ఇన్‌చార్జి అనిల్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న దేవానంద్

నాడు వెలవెల.. నేడు జలకళ

- 11 రోజుల్లో 8 టీఎంసీల నీరు చేరిక



వరద జలాలు రాక ముందు సోమశిల (ఫైల్)



కృష్ణా జలాల రాకతో జలకళ సంతరించుకున్న సోమశిల

అనంతసాగరం, ఆగస్టు 11: సోమశిల జలాశయం జలకళ సంతరించుకుంది. 10 రోజుల క్రితం డెడ్‌స్టోరేజ్‌లో ఉన్న నీటిమట్టం నేడు క్రమేణా పెరుగుతుండగా జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తం అవుతున్నది. ఎగువ నుంచి కృష్ణా జలాలు రాక ముందు క్రస్ట్‌గేట్ల దిగువకు నీరు ఉండేది. ఆగస్టు ఒకటి నుంచి శ్రీశైలం జలాలు సోమశిలకు చేరుతుండగా నీటిమట్టంలో మార్పు కనిపిస్తోంది. వరద జలాలు రాకతో క్రస్ట్‌గేట్ల వరకు నీటి నిల్వ చేరింది. 9.471 టీఎంసీలు ఉన్న నీటిమట్టం ఆదివారం నాటికి 17.293 టీఎంసీ లకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇక ఎగువ నుంచి రోజూ 12,520 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నది. కాగా దిగువ డెల్టా 200, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. నీటిమట్టం మరింత పెరిగితే తెలుగుగంగ వరద కాలువ ద్వారా కండలేరుకు నీరు విడుదల చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.

యువకుడి ప్రాణాలు కాపాడిన

ట్రాఫిక్ కానిస్టేబుల్

నెల్లూరు,(క్రైం): మతిస్థిమితం సరిగా లేని యువకుడు రైలు పట్టాలపై పడుకొని ఆత్మహత్యకు యత్నించగా ట్రాఫిక్ కానిస్టేబుల్ గమనించి పరుగులు తీసి కాపాడిన ఘటన ఆదివారం నెల్లూరులోని పెన్నా రైల్వే వంతెన వద్ద చోటుచేసుకుంది. వివరాలు మేరకు నగరంలోని కిసాన్‌నగర్ ప్రాంతానికి చెందిన రాజశేఖర్ బీటెక్ పూర్తి చేసి ఉన్నత ఉద్యోగాలు చేశాడు. అయితే అతను మతిస్థిమితం లేక బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం యువకుడు పెన్నా రైల్వే వంతెన వద్ద ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వే ట్రాక్‌పై పడుకొని ఉండగా సమీపంలోని సౌత్‌చెక్‌పోస్టు వద్ద విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ పీ చెన్నయ్య గుర్తించారు. హుటాహుటిన రైలు పట్టాలపైకి చేరుకొని యువకుడిని కాపాడారు. యువకుడి వివరాలు తెలుసుకొని తల్లిదండ్రులకు అప్పగించారు. కుమారుడిని కాపాడిన కానిస్టేబుల్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం సోషల్‌మీడియాలో ఈ వీడియో హల్‌చల్ చేస్తోంది.

భక్తిశ్రద్ధలతో అంకమ్మ తిరునాళ్ల

కావలి రూరల్: మండలంలోని రుద్రకోట పంచాయతీ గుమ్మడిబందలలో ఆదివారం అంకమ్మ తిరునాళ్ల భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పచ్చతోరణాలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్పీటీసీ తుళ్లూరు సా మ్రాజ్యం, మల్లికార్జున్ దంపతులు, టీడీపీ నేత తుళ్లూరు శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి అంకమ్మ తిరునాళ్లలో పాల్గొని పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ పూర్తి చేయాలి

నెల్లూరు(హరనాథపపురం), ఆగస్టు 11 : పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని డీసీవో గురప్ప సహకార శాఖ, సంఘాల సిబ్బందిని, ఆదేశించారు. ఆదివారం సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. కంప్యూ టరీ కరణ పూర్తికి అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

పగుళ్లిచ్చి.. నెర్రెలు బారింది

- నకిరేకల్లు నుంచి ఏర్పేడు వరకు 565 జాతీయ రహదారి దుస్థితి
- విచ్చలవిడిగా పశువుల సంచారం
- తరుచూ ప్రమాదాలు..


దుత్తలూరు వద్ద పగుళ్లిచ్చి, కుంగిన జాతీయ రహదారి


నర్రవాడ వద్ద నెర్రెలు బారిన రోడ్డు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: దుత్తలూరు, వరికుంటపాడు మండలాల్లో కొనసాగుతున్న 565 జాతీయ రహదారిపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. నకిరేకల్లు నుంచి ఏర్పేడు వరకు ఈ జాతీయ రహదారి విస్తరించి ఉంది. పలు ప్రాంతాల్లో రోడ్డు కుంగి పగుళ్లిచ్చి నెర్రెలుబారాయి. అతివేగంతో వస్తున్న వారు వాటిని గమనించక వాహనాలు అదుపుతప్పడంతో ప్రమాదాలకు గురవుతు న్నాయి. పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. కొత్తగా ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు పరిస్థితి తెలియక ప్రమాదాల బారినపడు తున్నారు. ఇందులో కొందరు మృత్యు వాతపడ గా అనేక మంది కాళ్లు, చేతులు విరిగి మంచానికే పరిమితం అవుతున్నారు. దీనికితోడు తిమ్మారెడ్డిపల్లి, రామాపురం, వరికుంటపాడు, జడదేవి, నర్రవాడ, దుత్తలూరు, చింతలకుంట, నందిపాడులో రాత్రి, పగలు తేడా లేకుండా పశువుల సంచారం ఉంది. రాత్రి సమయాల్లో వాహనదారులు వీటిని గుర్తించలేక ప్రమాదాలు జరు గుతున్నాయి. వేగని యంత్రణ చర్యలు చేపట్టక పోవడంతోనే ప్రమాదాలు సంభవిస్తు న్నాయని వాహనదారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా పోలేరమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠ


శిఖర కలశాలకు పూజలు చేస్తున్న వేదపండితులు

సంగం, ఆగస్టు 11: అన్నారెడ్డిపాలెం పోలేరమ్మ ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠను ఆదివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాలను ఆలయం శిఖరంపై ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదపండితులు మహాకుంభాభిషేక జలాలను భక్తులపై చల్లారు. కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

కోలగట్ల పెన్నానది ఒడ్డున వెలసిన నాగారపమ్మదేవికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్షీర, పంచామృతాలతో అభిషేకాలు చేసి అమ్మవారిని పూలతో అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పొంగళ్లతో నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం నిర్వాహకులు అన్నదానం చేశారు.


నాగారపమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

జియో బీపీ పెట్రోల్‌బంకు ప్రారంభం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: నర్రవాడ సమీపంలోని ఆదివారం జియో బీపీ పెట్రోల్‌బంకును ప్రకాశం జిల్లా కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోనప్పలు ప్రారంభించారు. వినియోగదారులకు నాణ్యమైన పెట్రోల్, డీజల్‌ను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయిస్తామన్నారు. సమీప గ్రామాల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెట్రోల్ బంకు నిర్వాహకులు కొప్పోలు సురేష్‌చౌదరి, నాగమేల్లేశ్వరరావు, పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

యాక్టివ్ సూపర్‌వైజర్ విధుల నుంచి తొలగింపు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 11: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని వరికుంటపాడు మండలం పెద్దిరెడ్డిపల్లి సెక్టార్ యాక్టివ్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న కళావతిని విధుల నుంచి తొలగించినట్లు ఇన్‌చార్జి సీడీపీవో పద్మావతి తెలిపారు. ఒకే పంచాయతీలోని అంగన్‌వాడీకేంద్రాలను విలీనం చేయాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా మహ్మదాపురం, పాపన్నగారిపల్లి పంచాయతీల అంగన్‌వాడీల కేంద్రాలను విలీనం చేశారు. గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాల మేరకు ఆమెను విధుల నుంచి తొలగించామన్నారు.

భగవద్గీతపై ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), ఆగస్టు 11: త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞానవేదిక దుత్తలూరు వారి ఆధ్వర్యంలో ఆదివారం రాచవారిపల్లి, జంగాలపల్లి, తురకపల్లి, భైరవరం గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి భగవద్గీత, శ్రీకృష్ణ జన్మాష్టమి గ్రామోత్సవంపై విస్తృత ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ప్రసాద్, కమిటీ సభ్యులు నరసింహులు, రమణమ్మ, వెంకటసుబ్బమ్మ, అక్షయ, భరత్‌కుమార్, రత్తమ్మ, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు వేడుకల నిర్వహణకు రంగం సిద్ధం

- చిన్న పంచాయతీలకు రూ.10వేలు, పెద్ద పంచాయతీలకు రూ.25వేలు
- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో ఉత్తర్వుల జారీ
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై సర్వత్రా హర్షం

ఆత్మకూరు, ఆగస్టు 11 : రాష్ట్రవ్యాప్తంగా 78వ స్వాతంత్ర్య వేడుకలను పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. గతంకంటే భిన్నంగా వేడుకల నిర్వహణకు ఖర్చుచేసుకునే వెసులుబాటును కల్పిస్తూ ఇటీవల డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ డైరక్టర్ కృష్ణతేజ స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఖర్చు చేసే వ్యయాన్ని చిన్న పంచాయతీలకు రూ.10వేలు, పెద్ద పంచాయతీలకు రూ.25వేల వరకు పెంచడంతో సర్వత్రా హర్షం వ్యక్తంఅవుతోంది. ఒకప్పుడు ఈ వేడుకలు గ్రామాల్లో మొక్కుబడిగా నిర్వహించేవారు. ఆయా గ్రామాల సర్పంచులు పాఠశాలలకు వెళ్లి జెండాలు ఎగురవేసేవారు. 5వేలలోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.100, అంతకంటే ఎక్కువ జనాభా ఉంటే రూ.250 మాత్రమే సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసుకునే అవకాశం ఉండేది. అయితే డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు ఈ మొత్తాన్ని పెంచారు. వాటిని సాధారణ నిధుల నుంచి వాడుకోవచ్చని ప్రభుత్వం నిర్ణయించింది. పంచాయతీ పరిధిలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టత, రాజ్యాంగ విలువలు, స్థానిక సంస్థల పాలన తదితర అంశాలపై వ్యాసరచన, క్విజ్, డిబేట్‌తో పాటు ఆటల పోటీలు నిర్వహించాలని ఆదేశాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఆగస్టు 15న ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించేందుకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ నిర్ణయంతో ప్రజాప్రతినిధులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘర్షణపై కేసు నమోదు

ఉదయగిరి రూరల్, ఆగస్టు 11: పట్టణంలో ఓ అద్దె దుకాణం విషయమై జరిగిన ఘర్షణపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. కూరగాయల మార్కెట్ సమీపంలో షేక్ గాజుల అబ్దుల్‌నబీ సోదరుడు అరాఫత్ సందానీ వద్ద దుకాణాన్ని అద్దెకు తీసుకొని నడుపుకుంటున్నాడు. ఇటీవల అరాఫత్ భార్యకు ఉద్యోగం రావడంతో అబీద్ దుకాణాన్ని తనకు ఇవ్వాలంటూ యజమాని సందానీని అడిగాడు. అతను ఖాళీ చేస్తే ఇస్తానని యజమాని తెలిపాడు. ఈ విషయంపై అబీద్, అబ్దుల్‌నబీ మధ్య శనివారం రాత్రి వివాదం చోటుచేసుకొంది. అబ్దుల్‌నబీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి శిక్షణ తరగతులు

వరికుంటపాడు: స్థానిక మండల కార్యాలయంలో సోమవారం నుంచి మూడురోజుల పాటు సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకట కృష్ణకుమారి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పంచాయతీల అభివృద్ధిలో భాగంగా పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, విధులు, బాధ్యతలు, అభివృద్ధి ప్రణాళిక అంశాలపై శిక్షణ ఇస్తామన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు


నెల్లూరుపాలెంలో ట్రాఫిక్ సరళిని పరిశీలిస్తున్న సీఐ గంగాధర్‌రావు

ఆత్మకూరు, ఆగస్టు 11: పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపడతామని సీఐ గంగాధర్‌రావు తెలిపారు. నెల్లూరుపాలెం సెంటర్‌లో ట్రాఫిక్ ప్రక్రియను పరిశీలించామని, త్వరలో ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా దృష్టి సారిస్తామన్నారు. ముందుగా పట్టణంలోని అన్ని ప్రాంతాలను పరిశీలించి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళతామని తెలిపారు. శాంతిభద్రతల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.

ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?


రోడ్డును కమ్మేసిన కంపచెట్లు

అనంతసాగరం, ఆగస్టు 11: మండలంలోని గౌరవరం-పల్లవోలు రోడ్డును కంపచెట్లుగా ఏపుగా పెరిగి రోడ్డును కమ్మేస్తున్నాయి. ఈ సమస్యతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వీటితో ఎదురెదురుగా రెండు వాహనాలు వస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని గ్రామస్థులతో పాటు వాహనదారులు వాపోతన్నారు. అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సైనికులు, మాజీ సైనికులకు ఉచితంగా రక్త పరీక్షలు

ఆత్మకూరు, ఆగస్టు 11: స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో భాగంగా ఈ నెల 15న ఉదయం 6గంటల నుంచి ఆత్మకూరులోని అపోలో క్లినిక్ ల్యాబొరేటరీలో సైనికులు, మాజ సైనికులకు ఉచిత రక్త పరీక్షలు నిర్వహిస్తామని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షేక్ సంధాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. షుగర్ పరీక్షలు, గుండె సంబంధిత పరీక్షలతో పాటు కంప్లీట్ బ్లడ్ కౌంట్ (సీబీసీ), మూత్ర పరీక్షలు ఉచితంగా చేస్తామన్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్మీ సైనికుడు నాగేశ్వరరావుతో జాతీయ జెండాను ఆవిష్కరిస్తామన్నారు. పరీక్షలు చేయించుకోదలచిన వారు ఏమి తినకుండా రావాలని కోరారు.

బస్సు కోసం ప్రయాణికుల నిరీక్షణ

- బస్‌షెల్టరు లేక అవస్థలు పడుతున్న ప్రజలు


రోడ్డుపైనే బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

మర్రిపాడు, ఆగస్టు 11: మండలకేంద్రంలో బస్‌షెల్టరు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మండలంలోనే నెల్లూరు-ముంబయి జాతీయరహదారి ఉండంతో నిత్యం వాహనాలతో రద్దీ ఎక్కువగా ఉంటుంది. మర్రిపాడు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు నెల్లూరు, కడపకు వెళ్లేందుకు, కళాశాలకు వెళ్లేందుకు విద్యా ర్థులు, వైద్యశాలలు, వ్యాపార లావాదేవీలతో ఇతర ప్రాంతాల నుండి ప్రజలు వస్తుంటారు. వీరికి మండల కేంద్రంలో కూర్చోవటానికి బస్సు షెల్టర్ ఏర్పాటు చేయలేదు. అనువైన స్థలం లేక ఎండకు, వానకు రోడ్డుపై నిలబడి బస్సు ఎక్కాల్సిన దుస్థితి ఉంది. నెల్లూరుకు వెళ్లేందుకు కడప, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, కర్నూలు, అనంతపురం, నంద్యాల దూరప్రాంతాల ప్రయాణికులు వెళ్తుంటారు. మర్రిపాడులో టిఫిన్, భోజనాలు చేసేందుకు డ్రైవర్లు బస్సులను ఆపుతుంటారు. ఇక్కడ మరుగుదొడ్ల సౌకర్యం లేక అవస్థలు పడతారు. జిల్లా, రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పి మంత్రి, ఎంపీ పదవులను అనుభవించిన మేకపాటి కుటుంబం మర్రిపాడులో చిన్నపాటి బస్‌షెల్టరు, మరుగుదొడ్లు నిర్మించేందుకు ఆసక్త చూపలేదు. కూటమి ప్రభుత్వం సమస్యను తీరుస్తుందని మండల ప్రజలు ఆశలతో ఎదురు చూస్తున్నారు.

జాతీయ రహదారి పనుల్లో నిబంధనలకు తూట్లు!

- దుమ్ముతో వాహనదారుల అవస్థ


టోల్‌గేట్ నిర్మాణ పనుల వద్ద నీరు పట్టకపోవడంతో లేస్తున్న దుమ్ము

కలిగిరి, ఆగస్టు 11: కావలి-దుత్తలూరు మధ్య జరుగుతున్న జాతీయ రహదారి పనుల్లో పలుచోట్ల రోడ్డు నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు నిబంధనలు పాటించకుండా పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మాణ పనుల్లో మట్టి, కంకర మిశ్రమాన్ని లేయర్లుగా వేసే క్రమంలో నీరు సరిగా పట్టకపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించేవారు దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వాహనాలు, పెద్ద వాహనాల వెనుక ద్విచక్ర వాహనదారులు ప్రయాణించాలంటే మట్టికొట్టుకుపోతున్నారు. దుమ్ము వలన లైట్లు వేసుకొని ప్రయాణించాల్సివస్తుందని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా కలిగిరి సమీపంలో టోల్‌గేట్ నిర్మాణం, పోలంపాడు గ్రామ సమీపంలో చెరువుకట్ట వద్ద రోడ్డు నిర్మాణాల్లో కంకర మిశ్రమానికి నీరు పట్టకపోవడంతో రోడ్డుకి సమీపంలో ఉన్న ఇళ్లల్లోకి దుమ్ము చేరి పేరుకుపోతుందని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు నిర్మాణ పనుల్లో రోడ్డును 3 నుంచి 4 అడుగుల మేరకు తవ్వినపుడు చివర అంచుల్లో రక్షణ చర్య లు సరిగా చేపట్టకపోవడం వల ఎప్పుడు ఎలాఅంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు.

> కావలి, కలిగిరి మధ్య జరుగుతున్న రోడ్డు పనుల్లో కంకర మిశ్రమం చేస్తున్న ప్రదేశాల్లో కాంట్రాక్టర్లు నీరు పట్టకపోవడంతో వాహనదారులు ఈ మార్గంలో ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. దీనికితోడు సమీపంలో ఉన్న ఇళ్లలోకి దుమ్ము విపరీతంగా వస్తోంది. దుమ్ము కాలుష్యంతో అనారోగ్యాల బారిన పడాల్సివస్తుంది. పోలంపాడు గ్రామం, టోల్‌గేట్ సమీపంలో రహదారి నిర్మాణాల వద్ద దుమ్ము లేవకుండా నీరుపట్టేటట్లు అధికారులు చర్యలు తీసుకొని ఇబ్బందులు తొలగించాలి.
> - కల్లూరు చంద్రమౌళి, పోలంపాడు

దుమ్ము లేవకుండా నీరుపట్టాలి

జాతీయ రహదారి కావడం, నిబంధనలు పూర్తిస్థాయిలో పాటించకపోవడం పట్ల సంబంధిత అధికారులు పరిశీలించి రహదారి నిర్మాణ పనుల్లో రోడ్డుపై నీరు పట్టి వాహనాలు వెళ్లేసమయంలో దుమ్ము లేవకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

వ్యాపారులకు అండగా ఉంటా..

- బులియన్ మర్చంట్స్ ప్రమాణ స్వీకారోత్సవంలో ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి

కావలి, ఆగస్టు 11: న్యాయంగా వ్యాపారం చేసే ప్రతి ఒక్కరికీ అండగా నిలుస్తానని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం కావలిలో జరిగిన కావలి డివిజన్ బులియన్ మర్చంట్స్, ఫాన్‌బోకర్స్ అసోసియేషన్‌ల ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ వ్యాపారులు, ప్రజలతో కలసి కావలిని అభివృద్ధి చేసుకుందామని చెప్పారు. నియోజకవర్గానికి 4వేల ఎకరాలలో భారీ ఎత్తున పరిశ్రమలు రాబోతున్నాయని, త్వరితగతిన కావలి పారిశ్రామికంగా అభివృద్ధి చెంది మరో శ్రీసిటీని తలపిస్తోందన్నారు. జువ్వలదిన్నెలో నిర్మాణంలో ఉన్న ఫిషింగ్ హార్బర్ త్వరలో ప్రారంభం కానుందన్నారు. దగదర్తిలో త్వరలో ఎయిర్‌పోర్టు నిర్మాణం జరుగబోతుందని తద్వారా కావలి నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెట్టబోతుందని చెప్పారు. నూతనంగా ఎన్నికైన బులియన్‌మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మొగళ్ల పల్లి రాజా, ఫాన్ బ్రోకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట రమేష్‌లను ఎమ్మెల్యే సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ పోతుగంటి అలేఖ్య, నేతలు పోట్లూరు శ్రీనివాసులు, అర్షియా బేగం, తటవర్తి రమేష్, పోతుగంటి శ్రీకాంత్, చవల రామకృష్ణ, తిరువీధి ప్రసాద్, బీజేపీ నేతలు కందుకూరి వెంకటసత్యనారాయణ, సీవీసీ సత్యం, కే. బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

భగత్‌సింగ్ గణేశ్‌యూత్ ఆధ్వర్యంలో స్థానిక ఉదయగిరి బ్రిడ్జి సెంటర్‌లో నిర్వహించనున్న వినాయక చవితి ఉత్సవాల పోస్టర్లను ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఆవిష్కరించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం జరుగకుండా వేడుకలను నిర్వహించాలని ఆయన సూచించారు. అలాగే జనతాపేట నార్త్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంచర్ల టెక్స్‌టైల్స్ దుకాణాన్ని ఆయన ప్రారంభించి వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర సతీమణి విజయకుమారి ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని ఆమె పేరు మీదుగా నిరుపేద విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు.

జర్నలిస్ట్ కుటుంబానికి ఆర్థిక సాయం

కావలి రూరల్ : కావలి మండలం రుద్రకోటకు చెందిన జర్నలిస్టు జరుగుమల్లి అనిల్ భౌతికఖాయాన్ని ఆదివారం ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి సందర్శించారు. మృత దేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ డైరెక్టర్ భీమా రంగారావు, స్థానిక నాయకులు ఉన్నారు.

కలుషిత నీరే దిక్కు!

- పైపు లైన్ల లీకేజీ ● పట్టించుకోని అధికారులు


రాజావీధిలో లీకవుతున్న తాగునీరు

బిట్రగుంట, ఆగస్టు 11: బోగోలు మండలంలోని పలు గ్రామాల్లో తాగునీటి పథకం పైపులైన్లు లీకేజీలతో కలుషిత నీరు సరఫరా అవుతోంది. ఈ విషయాన్ని ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. దాదాపు పది వేల మందికి పైగా జనాభా ఉన్న బోగోలు పంచాయతీలో అడుగడునా మెయిన్ వాటర్ పైపులైన్ లీకవుతోన్నాయి. పంచాయతీ కార్యాలయం సమీపం నుంచి కుమ్మర వీధి రైల్వే గేట్ వరకు 300 మీటర్ల పొడవులో దాదాపు పది చోట్ల పైపులైన్ లీకేజీలు ఉన్నాయి. ఎప్పుడు ప్రజలతో రద్దీగా ఉండే రాజా వీధిలో స్టేట్ బ్యాంక్, బాబా మందిరం, ప్రాథమిక పాఠశాల, పాల సొసైటీకి వెళ్లే రోడ్డులో పైపులైను లీకై నీరు రోడ్లపై నిల్వ చేరి కలుషితమవుతోంది. దాదాపు 50 ఏళ్ల క్రితం పంచాయతీ కార్యాలయం వద్ద నుంచి గ్రామంలోకి వేసిన ప్రధాన పైపులైను దెబ్బతినడం వలన పలు చోట్ల వాటర్ లీకేజ్ అవుతోంది. ఎంపీపీ, జడ్పీటీసీలే కాకుండా ప్రధాన పార్టీల మండలాధ్యక్షులు నివశించే పంచాయతీలో తాగునీటి కలుషితంపై మాట్లాడే నాయకుడు లేడు.

- విశ్వనాథరావు పేట పంచాయతీ కొత్తూరులో పలు చోట్ల వాటర్ పైపులైను లీకేజీలు దర్శనమిస్తున్నాయి. వాటి మరమ్మతు విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని వాటర్ పైపులైన్ల మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

నేటి నుంచి సర్పంచులకు శిక్షణ

లింగసముద్రం, ఆగస్టు 11 : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నుంచి ఈ నెల 14వ తేదీ వరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో కట్టా శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణలో పారిశుధ్యం, వీధిలైట్లు ఏర్పాటు, జీపీడీపీ (రిఫ్రెషర్) అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం


తాగునీటి ప్లాంటును ప్రారంభిస్తున్న భానుచందర్

దగదర్తి(బిట్రగుంట), ఆగస్టు 11: దగదర్తి పంచాయతీ ఎస్టీ కాలనీలో తాత, నానమ్మ మాలేపాటి రామానాయుడు, చెంచులక్ష్మమ్మల జ్ఞాపకార్థం వారి మనువడు, టీడీపీ యువ నాయకుడు మాలేపాటి భానుచందర్ నాయుడు నిర్మించిన మినీ నివాటర్ ప్లాంట్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మాలేపాటి సుధాకర్ నాయుడు, వడ్డే వినయ్ కుమార్, క్రిష్ణయ్య, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్యాలెస్ పాలనతో దారుణ పరిస్థితులు : సోమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం) : చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా మొన్నటి వరకు ప్యాలెస్ నుంచి జరిగిన పాలనతో ప్రజలు చాలా దారుణమైన పరిస్థితులు అనుభవించారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లి ఫైల్స్ ఘటనలో సబ్ కలెక్టర్ కార్యాలయం తగలబడితే సర్వేపల్లిలో ఏకంగా కోర్టులో ఫైల్స్‌నే లేపేశారని ఆరోపించారు.

హర్ ఘర్ తిరంగ ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్డీఏ కూటమి నాయకులు

జలదంకి, ఆగస్టు 11: జలదంకిలో ఎన్డీఏ కూటమి నాయకులు ఆదివారం హర్ ఘర్ తిరంగ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డే శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీ స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి మువ్వన్నెల జెండాలు చేతబూని బైక్‌లపై పురవీధుల్లో సాగింది. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాటంలో అమరులైన వారి విశిష్టతను వివరించారు. ఈ ర్యాలీలో టీడీపీ మండల అధ్యక్షుడు పి.మధుమోహన్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు కంచర్ల శరత్‌నాయుడు, బీజేపీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు చల్లా హనుమాన్‌రెడ్డి, జలదంకి ఉపసర్పంచు కూరపాటి మాలకొండారెడ్డి, జడ్పీహైస్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ మారుబోయిన సుందరయ్య, మండల తెలుగుయువత అధ్యక్షుడు మునగాల తిరుమలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విప్లవ కెరటం గడ్డం కోటారెడ్డి


కోటారెడ్డి స్మారక సభలో పాల్గొన్న విరసం నేతలు

కావలిటౌన్, ఆగస్టు 11: విప్లవ కెరటం కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి అని విరసం నేతలు రుక్మిణి, ప్రసాద్‌లు పేర్కొన్నారు. ఆదివారం పాతూరులోని దొడ్లవారి స్థలంలో కామ్రేడ్ గడ్డం కోటారెడ్డి 50వ వర్ధంతి స్మారక సభ విరసం నాయకుడు చెంచయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్య వక్తలుగా విరసం నేతలు నల్లూరి రుక్మిణి, సీఎస్ఆర్ ప్రసాద్, వీక్షణం పత్రికా సంపాదకుడు వేణుగోపాల్ పాల్గొని కోటారెడ్డికి నివాళులర్పించారు. కావలి ప్రజలకు కోటారెడ్డి త్యాగాలు పోరాటాలు గుర్తుండిపోయేలా ఆయన స్మారక స్థూపం ఉండాలన్నారు. కార్యక్రమంలో కోటారెడ్డి కుమారుడు కృష్ణారెడ్డి, విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్ రెడ్డి, మాజీ ఏజీపీ పోట్లూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలకు సత్కారం


పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న నిర్వాహకులు

కావలిటౌన్, ఆగస్టు 11: వివిధ రంగాల్లో ఉత్తమ సేవకులుగా పురస్కారాలందుకున్న కావలికి చెందిన కావలి పీఎంపీ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య, ఆపద్బాంధవ సేవాట్రస్ట్ బాధ్యులు మధుసూదన్‌రావు, రాజ్యలక్ష్మి దంపతులకు, టైంటు హెల్ప్ సంస్థ అధ్యక్షుడు నందిపాటి రమేష్, తదితరులను ఆదివారం పట్టణంలో స్వచ్ఛంద సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సత్కరించారు. వేదిక అధ్యక్షుడు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఖాదర్‌బీ, సోమిశెట్టి బ్రహ్మయ్య, ఘంటసాల రామచంద్రయ్య, ఒట్టూరు మస్తానయ్య, శుభాష్ చంద్రబోష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ


శిలలకు పూజలు చేస్తున్న నిర్వాహకులు

కలిగిరి, ఆగస్టు 11: కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెం తిప్ప వద్ద హరిహర పుత్ర అయ్యప్పస్వామి దేవస్థానం నిర్మాణానికి ఆదివారం భూమిపూజ కార్యక్రమం వేదపండితులు వి సూర్యనారయణాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. ఆలయ నిర్మాణం వద్ద జరిగిన హోమాలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో అయ్యప్ప భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

దివ్యాంగుల పాఠశాలకు సరుకుల వితరణ


దివ్యాంగుల పిల్లలతో కమిటీ సభ్యులు

కందుకూరు, ఆగస్టు 11: పట్టణంలోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలకు లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన నాగార్పమ్మ యూత్ ఆధ్వర్యంలో రూ.30వేలు విలువజేసే బియ్యం, నిత్యావసర సరుకులు వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు భోజన ఏర్పాట్లు చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే..!?

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు
- అవస్థల్లో ప్రజలు, వాహనచోదకులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 11: మండలంలోని గ్రామీణ ప్రాంతాల అంతర్గత రోడ్లుతోపాటు గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్లు అడుగడుగున గుంతలతో అధ్వానంగా ఉన్నాయి. ఈ గోతుల్లో వర్షం నీరు నిలిచి చినుకుపడితే బురదమయంగా తయారవుతోన్నాయి. ఆ రోడ్లపై ప్రజలు కనీసం నడవలేని పరిస్థితి నెలకొనగా వాహనాలు జారి పడుతుండడంతో వాహనచోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత 5 ఏళ్లలో ఆయా ప్రాంతాల్లో పలు మార్లు అధికారులు, ప్రజాప్రతినిధులు సందర్శించిన సమయంలో ఈ పరిస్థితిని చూసి కూడా పట్టించుకోలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో వర్షాలు కురిసినప్పుడల్లా ఆయా రోడ్లులో నీరు నిలిచి దుస్థితికి చేరుతున్నాయి. దీంతో పాటు దోమలకు అవాస ప్రాంతాలుగా మారి దాడి చేస్తుండడంతో ప్రజలు వ్యాధులకు గురవుతున్నారు. ముఖ్యంగా మండలంలోని మినగల్లు, పెనుబల్లి, కాగులపాడు, పంచేడు, నాగామాంబాపురం, పురంధరపురం, దామరమడు, పోలినాయుడు చెరువు పరిధిలోని పలు గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొంది. అందులోనూ ఎక్కువగా దళితవాడలు, గిరిజన కాలనీల్లో రోడ్లు మరీ దారుణంగా ఉన్నాయి.

● ఇసుక, మట్టి, గ్రావెల్ వాహనాలతో...

అక్రమంగా ఇసుక, మట్టి, గ్రావెల్ తరలించే భారీ వాహనాలు గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా తిరగడంతో రోడ్లు దెబ్బతిని అధ్వానంగా మారాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దామరమడుగు, జొన్నవాడ, పొర్లుకట్ట, కాలువకట్టలు, మినగల్లు, బుచ్చి, సాల్మానుపురం, పెనుబల్లి, పంచేడు, కనిగిరి రిజర్వాయర్, రామచంద్రాపురం, బుచ్చి పెద్దూరు, చెన్నూరు తదితర గ్రామాల మీదుగా నిత్యం ఇసుక, గ్రావెల్, మట్టి తోలకాలు జరగడంతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఇటీవల వర్షాలలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి సైతం మినగల్లు, పెనుబల్లి, నాగామాంబాపురం, తదితర ప్రాంతాల్లో నరక ప్రయాణం సాగించారు. ఇప్పటికైనా అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలు సాగించేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



మినగల్లులో బురదమయమైన రోడ్డు



పెద్ద గోతులతో అధ్వానంగా పెనుబల్లి - మినగల్లు రోడ్డు



గ్రామోత్సవంలో మాతమ్మ పరమేశ్వరి

ఘనంగా మాతమ్మ గ్రామోత్సవం

మనుబోలు, ఆగస్టు 11: జట్లకొండూరులో ఆదివారం మాతమ్మ (రేణుకా పరమేశ్వరి) గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అరుంధతీయులంతా ఏకమై యువకులతో కలిసి గ్రామం బాగుకోరుతూ మాతమ్మను ఈనెల 9న కొలువుంచి మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా పూలమండపంలో అలంకరించి, జింక వాహనంపై ఉంచి, మేళతాళాలు, తప్పెట్ల సందడితో గ్రామోత్సవం ముందుకు సాగింది.

విశ్రాంత ఉద్యోగుల సంఘానికి గదిని కేటాయించాలి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11 : వైద్యఆరోగ్య శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘానికి నగరంలోని జూబ్లీ వైద్యశాలలో ఒక గదిని కేటాయించాలని ఏపీ స్టేట్ గవర్నమెంటు మెడికల్ హెల్త్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కేఈసీ విద్యాసాగర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లం శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు ఏ హరిబాబు ఓ ప్రకటనలో కలెక్టర్‌ను కోరారు. జూబ్లీ వైద్యశాలలో గదిని కేటాయిస్తే విశ్రాంత వైద్యశాఖ ఉద్యోగులందరూ ప్రజలకు ఉచిత వైద్యసేవలు అందిస్తారన్నారు. సంఘంలో సభ్యులుగా విశ్రాంత డాక్టర్లు ఎందరో ఉన్నారన్నారు. ఈ విషయమై మంత్రి సత్యకుమార్, కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందచేశామని తెలిపారు.

'ఘర్షణ రాజకీయాలు మంచిదికాదు'

నెల్లూరు రూరల్, ఆగస్టు 11 : రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలుండాలేగానీ ఘర్షణలు ఉండకూడదని 2వ డివిజన్ కార్పొరేటర్ పడిగినేటి రామ్మోహన్ అన్నారు. ఆదివారం ఆయన గుడిపల్లిపాడులోని తన నివాసంలో మాట్లాడుతూ రాజకీయ కక్షల నేపథ్యంలో కొందరు తన చిన్నకుమారుడిపై దాడులకు పాల్పడ్డారని చెప్పారు. ఇలాంటి రాజకీయాలు ఆరోగ్యకరం కాదన్నారు. తనకు, టీడీపీ నాయకుడు అనిల్‌కు కొన్ని రోజులుగా రాజకీయ వివాదం నడుస్తోందని, ఈ నేపథ్యంలో శనివారం రొయ్యల గుంట దగ్గరున్న తన కుమారుడిని రెచ్చగొడుతూ దాడులకు దిగారని తెలిపారు. ఈ హత్యాయత్నంపై విచారించి చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ

నెల్లూరు,(క్రైం), ఆగస్టు 11: బాలాజీనగర్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా కే సాంబశివరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ఎస్‌ఐ విజయ శ్రీనివాస్, సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. సాంబ శివరావు మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళతామన్నారు. అసాంఘిక శక్తులు, కార్యకలాపాలను ఉపేక్షించేది లేదని, కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.



సాంబశివరావు

ప్రగతి చారిటీస్‌లో అన్నదానం




అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 11 : నగరంలోని ప్రగతి చారిటీస్‌లో ఆదివారం అన్నదానం జరిగింది. గిద్దలూరు ఉమాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆమె కుమారుడు సాయిపవన్‌కుమార్ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్, మహబూబ్‌బాషా, రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ షేక్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

కామాక్షితాయి భక్తులకు తాగునీటి సమస్య

● 8 నెలలుగా పట్టించుకోని అధికారులు

బుచ్చిరెడ్డిపాళెం, ఆగస్టు 11: మండలంలోని జొన్నవాడ ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం రెండేళ్ల క్రితం ఆలయం వద్ద దాత దాతృత్వంతో రూ.5లక్షలతో మినరల్ వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశారు. అప్పటినుంచి భక్తులకు ఈ వాటర్‌ప్లాంట్ ఎంతో ఉపయోగంగా ఉండేది. గత 8 నెలలుగా వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి భక్తులకు తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. ఈ విషయాన్ని పలు మార్లు భక్తులు ఆలయ అధికారులు, సిబ్బందికి ఫిర్యాదు చేసిన ప్రయోజనం లేకపోగా అడిగిన భక్తులపై మండిపడితున్నారన్న ఆవేదన వ్యక్తమవుతోంది. తాజాగా ఓ భక్తుడు ఈ సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఐనా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కాగా ఏర్పాటు చేసిన దాతలే మరమ్మతులు చేయిస్తామన్నారని ఈవో చెప్పారు.



జొన్నవాడ ఆలయంలో మూతపడిన మినరల్ వాటర్ ప్లాంటు

సోమిరెడ్డిని విమర్శిస్తే ఊరుకోం

● టీడీపీ మండలాధ్యక్షుడు రాజాయాదవ్



వెంకయ్యస్వామి ఆశ్రమం వద్ద టెంకాయలు కొడుతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

వెంకటాచలం, ఆగస్టు 11 : సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి, ఆయన కుమారుడు రాజాగోపాల్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు, విమర్శలు చేస్తామంటే చూస్తూ ఊరుకోమని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజాయాదవ్ హెచ్చరించారు. మూడు రోజులకిందట రాజాయాదవ్ అసాంఘిక కార్యకలాపాలు వైసీపీ ఐదేళ్ల పాలనలోనే జరిగాయని ప్రమాణం చేసేందుకు గొలగమూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమం వద్దకు రావాలని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి, వైసీపీ నేతలకు సవాల్ విసిరిన విషయం తెలిసిందే. అందులోభాగంగా టీడీపీ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రమాణం చేసేందుకు ఆదివారం భారీగా తరలివచ్చారు. కానీ వైసీపీ నేతలు ప్రమాణం చేసేందుకు రాకపోవడంతో కోడిపందాలు, పేకాట, డైమండ్ డబ్బా, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలు వైసీపీ నేతల కనుసన్నల్లోనే జరిగిన వాస్తవం కావడంతోనే ప్రమాణం చేసేందుకు రాలేదని రాజాయాదవ్ విమర్శించారు. టీడీపీపై అసత్య ఆరోపణలు చేయడం కాదని, వాస్తవాలను నిరూపించాలని, తప్పుడు ప్రచారాలు చేసినంతా మాత్రన సర్వేపల్లి ప్రజలు మాజీ మంత్రి కాకాణిని నమ్మేస్థితిలో లేరన్నారు. ఇప్పటికైనా వైసీపీ నేతలు హుందా రాజకీయాలు చేయడం నేర్చుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలున్నారు.

గంగమ్మకు బోనాల సమర్పణ

పొదలకూరు, ఆగస్టు 11: గంగమ్మ కొలుపు మహోత్సవంలో భాగంగా ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించారు. యువకుల డప్పు చప్పుళ్లు, తీన్‌మార్ స్టెప్పులతో పట్టణం మారుమ్రోగింది. పోతురాజుల వీరంగం, భక్తుల పూనకాలతో పొదలకూరు సరికొత్త శోభను సంతరించుకుంది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కోరినకోర్కెలు తీర్చాలని, చల్లగా చూడాలని కోరుతూ బోనాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఏడాదికి తాము అనుకున్నది జరిగితే తిరునాళ్లను మరింత ఘనంగా నిర్వహిస్తామని పెద్దగొల్ల మద్దిరిల్ల నరసింహులు యాదవ్, యరగర్ల జయరామయ్య, వేమయ్య, కండే వాసు, వాకా శివ తెలిపారు.



బోనాలతో వెళుతున్న మహిళలు

యాదవ సంఘం ఆధ్వర్యంలో..

పట్టణంలోని యాదవ సంఘం సభ్యులు గంగమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక బుట్టలతో, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఇంటినుంచి ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. పొంగళ్లు పొంగించి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. సకాలంలో వానలు కురిసి, పాడిపంటలతో, సుఖసంతోషాలతో ప్రజలు ఉండాలని కోరుకుంటూ ఈ తిరునాళ్ల నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయం కిక్కిరిసింది.



పొంగళ్లు పొంగిస్తున్న భక్తులు

రామాలయంలో చోరీపై విచారణ

సైదాపురం, ఆగస్టు 11: గిద్దలూరు పంచాయతీ పరిధిలోని ఇస్కపల్లిపల్లి రామాలయంలో జరిగిన చోరీపై ఆదివారం పోలీసులు గ్రామస్థులతో కలిసి విచారణ చేప ట్టారు. అనంతరం ఆలయ పరిసరాలను క్లూస్ టీంతో కలిసి పరిశీలించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఆరు గ్రాముల సీతమ్మ వారి మంగళ సూత్రంతో పాటు హుండీలోని రూ.10వేల నగదు చోరీ చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మనుబోలు, ఆగస్టు 11: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని 1998-99 పూర్వవిద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించారు. 25ఏళ్ల తరువాత పాఠశాలలో కలిసి అప్పటి గురువులను శాలువా, పూల మాలలతో సన్మానించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

గోతాలు కప్పి వదిలేశారు

- వెంకటేశ్వరపురం ఫ్లైవోవర్‌పై మరమ్మతులు
- క్యూరింగ్ విషయంలో ఉదాసీనత
- పటిష్టంగా లేకపోతే మళ్లీ ప్రమాదమే!



వెంకటేశ్వరపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిపై మరమ్మతులు చేసిన చోట వేసిన గోతాలు



వంతెనపై రాకపోకలు నిలిపేస్తూ ఏర్పాటు చేసిన బారికేడ్లు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), ఆగస్టు 11 : వెంకటేశ్వరపురంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డుకు మరమ్మతులు పూర్తయ్యాయి. రైల్వే ట్రాక్ పైభాగంలో వంతెనపై సిమెంటు రోడ్డు నెలరోజుల క్రితం కుంగిన విషయం తెలిసిందే. ఆ ప్రాంతంలో పెద్ద గొయ్యి ఏర్పడటంతో వంతెనపై వాహన రాకపోకలు నిలిపివేశారు. వారం రోజుల క్రితం మరమ్మతులు పూర్తిచేశారు. అయితే కుంగిన ప్రాంతంలో నూతనంగా వేసిన కాంక్రీట్‌కు క్యూరింగ్ సక్రమంగా చేయడంలేదనే ఆరోపణలున్నాయి. సహజంగా సిమెంటు రోడ్డు పూర్తైన తరువాత మట్టితో కట్టలు కట్టి నీరు నింపి క్యూరింగ్ చేస్తారు. కానీ ఇక్కడ మాత్రం నీరు నిలుపకుండా కేవలం గోతం పట్టలు కప్పి వదిలేశారు. ఇప్పటికే రెండు పర్యాయాలు బ్రిడ్జి రోడ్డు కుంగి మరమ్మతులు చేశారు. అయినా కూడా అధికారులు నాణ్యత విషయంలో శ్రద్ధ వహించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సక్రమంగా క్యూరింగ్ చేసి వీలైనంత త్వరగా వంతెనపైకి వాహనాలను అనుమతించాల్సి ఉంది. ముంబయి జాతీయ రహదారికి అనుసంధానమైన ఈ వంతనపై నిత్యం వేలాది వాహనాలు తిరుగుతుంటారు. అయితే మరమ్మతుల కారణంగా వాహనాలను దారి మళ్లించడంతో కోవూరు, జొన్నవాడ ప్రాంతాల్లో తీవ్రంగా ట్రాఫిక్ కష్టాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో వంతెనపై అతుకులకు సక్రమంగా క్యూరింగ్ చేసి వాహనాలను వదలాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నెల్లూరు క్లబ్‌లో గదుల ప్రారంభం

నెల్లూరు రూరల్, ఆగస్టు 11 : నెల్లూరు క్లబ్‌లోని మొదటి అంతస్తులో నిర్మించిన గదులను రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. క్లబ్ అధ్యక్షకార్యదర్శులు, కమిటీ మెంబర్లతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. క్లబ్‌ను ఆధునీకరించడం, నూతన వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో పలు క్లబ్‌లకు నెల్లూరు క్లబ్ ఆదర్శంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.



గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

దేవుని కాలువలో పూడికతీతకు శ్రీకారం

నెల్లూరు(వైద్యం) ఆగస్టు 11 : నగరంలోని 16, 17, 18 డివిజన్లకు సంబంధించి డ్రైనేజీ సమస్య పరిష్కారానికి దేవుని కాలువలో పూడికతీత పనులు మొదలయ్యాయి. గతంలో ఈ డివిజన్లలో మురుగునీరు రోడ్లమీదకు వస్తుండటంతో ఆ సమస్యను మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరీప్రసాద్ రాష్ట్ర పురపాలక శాఖమంత్రి పొంగూరు నారాయణ, టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఆదేశంలో జూన్ నెలలో నాటి కమిషనర్ దేవుని కాలువను పరిశీలించి 7 అడుగుల లోతున పూడిక తీతకు టెండర్లు పిలిచారు. దీనికి అనుమతులు రావటంతో ఆదివారం పూడిక తీత పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా భువనేశ్వరీ ప్రసాద్ మాట్లాడుతూ ఏసీ నగర్ సంగం వద్ద కల్వర్టు నిర్మాణం పూర్తయి కాలువలో పూడిక తీస్తే డ్రైనేజీ సమస్య ఉండదని, దోమల బెడద కూడా తగ్గుతుందని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆకుల హనుమంతరావు, పసుపులేటి మల్లికార్జునరావు, సుభాన్‌బాషా, ఎలమందరెడ్డి, శ్రీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కాలువ పూడికతీత పనులకు టెంకాయ కొడుతున్న భువనేశ్వరీ ప్రసాద్

విద్యతోనే ఉన్నత స్థానం

పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11 : విద్య ద్వారా గౌడ సంఘీయుల బిడ్డలు ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. నెల్లూరు టౌన్‌హాల్లో ఆదివారం జిల్లా గౌడ కల్లుగీత పారిశ్రామికుల సంఘం, గౌడ సేవా సమితి ట్రస్టు కార్యనిర్వాహక అధ్యక్షుడు కోసూరు రాజశేఖర్‌గౌడ్ ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ కల్లుగీత కార్మికులందరూ వారి పిల్లలను బాగా చదివించాలని పిలుపునిచ్చారు. స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగూరు మస్తానయ్య మాట్లాడుతూ దివంగత కోసూరు గోవిందగౌడ్ 12 ఏళ్లుగా విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందచేస్తున్నారు. ఇప్పుడు ఆయన కుమారుడు దానిని కొనసాగించడం ఆనందదాయకమన్నారు. ఈ సందర్భంగా 220 మంది విద్యార్థులకు పురస్కారాలను అందచేశారు. కార్యక్రమంలో సెట్ డిప్యూటీ కమిషనర్ తిరగాబత్తిన శ్రీనివాసరావు, మాజీ జడ్పీటీసీ నాయుడు రాంప్రసాద్, వీఆర్సీ మాజీ ప్రిన్సిపాల్ ఆశోక్‌రావు, వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బడుగు కృష్ణమూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పొగాకు బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

ప్యాలెస్ పాలనతో దారుణ పరిస్థితులు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(హరనాథపురం), ఆగస్టు 11 : చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా మొన్నటి వరకు ప్యాలెస్ నుంచి జరిగిన పాలనతో ప్రజలు చాలా దారుణమైన పరిస్థితులు అనుభవించారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మదనపల్లి ఫైల్స్ ఘటనలో సబ్ కలెక్టర్ కార్యాలయం తగలబడితే సర్వేపల్లిలో ఏకంగా కోర్టులో ఫైల్స్‌నే లేపేశారని ఆరోపించారు. ఈ నెల 15 నుంచి ప్రారంభమయ్యే ప్రజల వద్దకు పాలన రెవెన్యూ సదస్సులతో ఇంకెన్ని ఫైల్స్ వెలుగులోకి వస్తాయోనన్నారు. ఫ్రీహోల్డ్ రిజిస్ట్రేషన్లు బంద్ చేయటం, చేతులు మారిన భూములపై విచారణ జరపడం కూడా ల్యాండ్ మాఫియాకు షాకేనన్నారు. చంద్రబాబు నాయుడు హయాంలో ఎప్పుడైనా పాలన ప్రజల చెంతే ఉంటుందన్నారు. మొత్తంగా కూటమి ప్రభుత్వ పాలనతో ప్రజలు మరో స్వాతంత్ర్యం వచ్చినట్లు భావిస్తుండటం శుభపరిణామం అని తెలిపారు.

రేపు చిత్రలేఖనం, దేశభక్తి గీతాల పాటల పోటీ



చిత్రలేఖనం, దేశభక్తి గీతాల పోటీ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 11 : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో చిత్రలేఖనం. దేశభక్తి గీతాల పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు జేఎస్ ట్రస్ట్ నిర్వహణ కమిటీ కన్వీనర్ నగేష్ వెల్లడించారు. ఆదివారం ఆ విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు చదివే పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ట్రస్ట్ నిర్వాహణ కమిటీ సభ్యులు జయరాం రెడ్డి, నరసింహారెడ్డి, మంగళం పుల్లయ్య పాల్గొన్నారు.

నిధులు మింగేశారు

కంచే చేను మేసింది అనే సామెతకు తాజాగా డీపీవో సర్పంచులకు జారీ చేసిన షోకాజ్ నోటీసులు అచ్చుగుద్దినట్లు సరిపోతున్నాయి. ఊరిని అభివృద్ధి చేయాల్సిన సర్పంచులే అందినకాడికి నిధులు మింగేస్తున్న వైనం నెల్లూరురూరల్ మండలంలో పంచాయతీ అధికారుల ఆకస్మిక తనిఖీల్లో బయటపడుతోంది. రూ. లక్షల ప్రజాధనాన్ని ఖర్చు చేసేసిన సర్పంచులు కనీసం కాగితపు ముక్కనుకూడా రసీదుగా చూపక పోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఈ తరహా నిధుల స్వాహా పర్వాన్ని కలివెలపాళెం, పెనుబర్తి, సజ్జాపురం గ్రామాల్లో అధికారులు నిగ్గుతేల్చారు. త్వరలో దేవరపాళెం, గొల్లకందుకూరు లోనూ తనిఖీలు నిర్వహించనున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా తదుపరి చర్యలు ఎలా ఉంటాయన్నదే ప్రశ్నార్థకంగా మారింది.

- పంచాయతీల్లో నిధులు స్వాహా చేసిన సర్పంచులు
- మూడు చోట్ల నిగ్గు తేల్చిన డీపీవో
- గొల్లకందుకూరు, దేవరపాళెంలో త్వరలో ఆడిట్
- కార్యదర్శులను పట్టించుకోని అధికారులు



నెల్లూరు రూరల్, ఆగస్టు 11 : సజ్జాపురం పంచాయతీ ఖాతా నుంచి రూ.3.50లక్షలు ఖర్చయినట్లు డీపీవో కార్యాలయం అధికారులు గుర్తించారు. అందుకు సంబంధించిన లెక్కలు లేకపోవడంతో ఆ పంచాయతీ సర్పంచ్ అప్పకూటి నారాయణను వివరణ కోరుతూ జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి నోటీసులు జారీ చేశారు. పెనుబర్తిలోనూ సుమారు రూ.30 లక్షలు భర్త ఖాతాకు బదిలీ చేసిన సర్పంచ్ వీ సుజనను కూడా వివరణ కోరారు. సాధారణ నిధులు రూ.7 లక్షల్లో లక్ష వరకు లెక్కలు లేవంటూ ఆక్షేపించారు. ఇదే తంతు కలివెలపాళెంలోనూ జరిగినట్లు గుర్తించి బాధ్యులకు తాకీదులులిచ్చారు. గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాల్సిన పాలకులు ఇలా రూ.లక్షల నిధులను దిగమిగేస్తుండటం పల్లె ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. సాధారణ నిధులతోపాటు ఆర్థిక సంఘం నిధులు మాత్రమే పంచాయతీలకు అందుబాటులో ఉంటాయి. వాటిని ఆచితూచి ఖర్చుపెట్టాల్సిన సర్పంచులు కనీసం లెక్కలు కూడా చూపకుండా మాయం చేయడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

దేవరపాళెం, గొల్లకందుకూరుల్లోనూ....

మండలంలోని చేపల సాగుపై అత్యధికంగా ఆదాయం వచ్చే పంచాయతీ గొల్లకందుకూరు. ఇందులోనూ నిధుల దుర్వినియోగం అయినట్లు అనుమానిస్తున్న డీపీవో కార్యాలయం అధికారులు త్వరలో డీఎల్‌పీవోతో తనిఖీలు నిర్వహించనున్నట్లు సమాచారం. ఆర్థిక సంఘం నిధులకంటే సాధారణ నిధులు ఎక్కువగా వచ్చే పంచాయతీ ఇదీ. ఇందులో అవినీతి ఆరోపణలు తొలి నుంచి వస్తున్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వంలో ఎవరూ పట్టించుకోలేదు. తాజాగా టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో అవినీతి ఆరోపణలున్న చోట అధికారులతో విచారణ జరిపిస్తున్నారు. దేవరపాళెంలో సాధారణ, ఆర్థిక సంఘం నిధులు గోల్‌మాల్ అయినట్లు ఆరోపణలుండగా, వేదగిరి బ్రహ్మోత్సవాల సమయాల్లో పంచాయతీకి వచ్చే ఆదాయం ఎంతన్నది లెక్కలు లేవన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక్కడ కూడా డీపీవో కార్యాలయం త్వరలో తనిఖీలు నిర్వహించనున్నది. ఇక, చెరువుల్లో చేపల సాగు హక్కుల ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చే కొత్తవెల్లంటి, పాతవెల్లంటి, ములుముడి, సౌత్ మోపూరు, కందమూరు, ఉప్పుటూరు గ్రామాల్లో కూడా అధికారుల తనిఖీలు జరుగుతాయని సమాచారం.

కార్యదర్శుల సంగతేంటి..?

గ్రామ పంచాయతీల్లో నిధుల వినియోగంలో సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి పాత్ర కీలకం. పంచాయతీల్లో అవినీతి జరిగిందని గుర్తించిన అధికారులు సర్పంచులకు షోకాజు నోటీసులిచ్చారు. అయితే, ఈ బాగోతంలో ఆయా పంచాయతీల కార్యదర్శుల పాత్ర ఎంతుంది...?, వారి ప్రమేయం లేకుండానే ఖాతాల్లోని నగదు బయటకు వెళ్తుందా...?, ఒకవేళ ఖర్చు చేసినా అందుకు లెక్కలు చూపాల్సింది కార్యదర్శులేగా...? మరి వారిని ఎందుకు విచారణల్లో పక్కన పెట్టారు...? అన్నది చర్చనీయాంశంగా మారింది. నిధుల మాయంపై పంచాయతీ అధికారులను పట్టించుకోరా...? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.





స్వాధీనం చేసుకున్న నాటుబాంబులు

నాటుబాంబుల కలకలం

● మణిపిరెడ్డిపల్లెలో 26 స్వాధీనం ● పోలీసుల అదుపులో ఇద్దరు

పాకాల, ఆగస్టు 11: పాకాల మండలంలోని చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లెలో నాటుబాంబులు కలకలం సృష్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మణిపిరెడ్డిపల్లె రైల్వేగేటు సమీపంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పక్కన ఓ ఇంట్లో ఆదివారం 26 నాటుబాంబులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటిని తయారు చేస్తున్న బాబు, గజేంద్రలను అదుపులోకి తీసుకున్నారు. పందుల పెంపకంతో జీవనం సాగిస్తున్న వీరు అడవి పందులను వేటాడడానికి నాటుబాంబులు తయారు చేస్తున్నట్లు చెబుతున్నారు. గుండ్రంగా ఉండే ఈ బాంబులను అడవి పందులు సంచరించే ప్రదేశాల్లో పెడతారు. అవి తినడానికి ప్రయత్నించినపుడు పేలి అడవి పంది ముఖం ఛిద్రమవుతుంది. ఆ తర్వాత పందిని స్వాధీనం చేసుకుని, దాని మాంసాన్ని వీరు విక్రయిస్తున్నట్లు తెలిసింది. పోలీసుల దర్యాప్తులో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





నిందితులు గజేంద్ర, బాబు

ధాన్యంలో దళారుల దందా



కల్తీ కాకుండా ఏదీ లభించే పరిస్థితి కనిపించడం లేదు. నాణ్యత కోసం వెతుకులాడుకునే పరిస్థితి వచ్చేసింది. చివరికి తినే అన్నం సైతం కల్తీ చేస్తున్నారు. ఆపై మధ్య తరగతి జనాలే లక్ష్యంగా దళారులు మోసం చేస్తున్నారు.

- పెళ్లకూరు/తడ

● 'బీపీటీ' రకంలో 'ఎన్‌ఎల్‌ఆర్'తో కల్తీ

● మధ్య తరగతి జనమే లక్ష్యంగా మోసం

ఒకప్పుడు నెల్లూరు మొలగొలుకులు ఫేమస్. ఆరు నెలల పాటు రైతు శ్రమించి దిగుబడి చేసే ధాన్యం రకమది. దీనిపై అన్నివర్గాల వారు మక్కువ చూపేవారు. తర్వాత సన్నరకాలకు గిరాకి వచ్చింది. అందులో ముఖ్యమైంది బీపీటీ 5224 (బాపట్ల జిలకర) ధాన్యం. ఈ పంట కేవలం 90 రోజుల నుంచి వంద రోజుల్లోపు రైతు చేతికి వస్తుంది. తినేందుకు తియ్యగా.. తృప్తిగా అనిపించే రకం ధాన్యం. ప్రస్తుతం ఈ రకం ధాన్యం ధర పుట్టి రూ.26,450. ఈ రకానికి మార్కెట్లో గిరాకి ఏర్పడింది. ఇటీవల బీపీటీలను పోలిన ఎన్‌ఎల్‌ఆర్ 3449 (నెల్లూరు జిలకర) రకం ధాన్యం అందుబాటులోకి వచ్చింది. ఈ ధాన్యం 80 రోజుల్లోనే చేతికొస్తుంది. పైగా ఎటువంటి తెగుళ్లకు ఆస్కారం లేకుండా రైతు ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుంది. నాణ్యత అంతంత మాత్రమే. రుచి ఉండకపోవడంతో ఎవరూ ఇష్టపడడం లేదు. ధరల్లో సైతం భారీ వ్యత్యాసం ఉంటుంది. ప్రస్తుతం ఎన్‌ఎల్‌ఆర్ 5224 పుట్టి ధర రూ.14,950గా ఉంది. అంటే బీపీటీ రకాలకు, ఎన్‌ఎల్‌ఆర్ 5224 రకం ధాన్యానికి మధ్య వ్యత్యాసం సుమారు రూ.11,500గా ఉంది. ఇదే దళారులకు, మిల్లర్లకు అవకాశంగా మారింది.

వ్యత్యాసం గుర్తించడం కష్టం

బీపీటీ, ఎన్‌ఎల్‌ఆర్ రకాలు చూసేందుకు ఒకేలా ఉంటాయి. రైతులకు, మిల్లర్లకు తప్ప అందులో వ్యత్యాసం గుర్తించడం కష్టం. దీనికితోడు ఈ రెండు రకాల ధాన్యాలను ఆడించి బియ్యం చేస్తే ఇక ఎవ్వరూ కనిపెట్టలేరు. ఇదే దళారులకు అనుకూలమైంది. రైతుల నుంచి రెండు రకాల ధాన్యాలను కొనుగోలు చేసే దళారులు, మిల్లర్లు కొన్ని ప్రదేశాల్లో ఈ రెండు రకాల ధాన్యాలను కలబోస్తారు. మూడు వంతుల బీజీటీ రకం ధాన్యంలో ఓ వంతు ఎన్‌ఎల్‌ఆర్ రకాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నారు. తద్వారా ఎన్‌ఎల్‌ఆర్ రకానికి కూడా బీపీటీ ధాన్యం ధరనే దళారులు వసూలు చేస్తున్నారు. ఈ దందా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని సూళ్లూరుపేట, దొరవారిసత్రం, పెళ్లకూరు మండలాల్లో భారీ ఎత్తున జరుగుతున్నట్లు సమాచారం. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలొస్తున్నాయి.


నగరపాలక అధికారులపై 'విజిలెన్స్'

టీడీఆర్ బాండ్ల జారీ, నిధులు దుర్వినియోగం చేసిన అధికారుల్లో గుబులు

విచారణకు ఆదేశించిన మంత్రి నారాయణ



తిరుపతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన అధికారులపై విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ మంత్రి నారాయణ ఆదేశించారు. ఆమేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి విభాగపు స్పెషల్ చీఫ్ సెక్రటరీకి లిఖితపూర్వక ఆదేశాలిచ్చారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి నగరపాలక సంస్థలో జరిగిన అవినీతి, అక్రమాలపై ప్రజాదర్బార్ (ఆర్టీజీ)లో భాగంగా మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. ఈక్రమంలో మంత్రి నారాయణకు తిరుపతి కార్పొరేషన్లోని అవినీతి అధికారుల గుట్టు విప్పాలని మంత్రి లోకేశ్ ద్వారా ఫిర్యాదులు వెళ్లాయి. దాంతో విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తూ నారాయణ నిర్ణయం తీసుకోవడంతో అవినీతి అధికారుల్లో గుబులు పట్టుకుంది. తిరుపతిలో జరిగిన ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్ (టీడీఆర్) బాండ్ల కుంభకోణం రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన విషయం తెలిసిందే. రూ.4వేల కోట్ల టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్టు అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించారు. అభివృద్ధి పేరుతో తుడా వేయాల్సిన మాస్టర్ ప్లాన్ రోడ్లను పక్కా ప్రణాళికతో తెరపైకి తీసుకొచ్చి స్థలాలు కోల్పోయిన వారి పేర్లతో బాండ్లు తీసుకుని కోట్లు కొల్లగొట్టారు. అగ్రికల్చర్, రెసిడెన్షియల్ పరిధిలోని స్థలాలను కూడా కమర్షియల్‌గా రిజిస్ట్రేషన్ విలువ పెంచేసి భారీగా లబ్ధి పొందారు. వైసీపీ నేతల జేబుల్లోకి దాదాపు రూ.400 కోట్ల వరకు వెళ్లినట్టుగా ఆరోపణలు ఉన్నాయి. అదేవిధంగా ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగంలో ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగమయ్యాయన్న విమర్శలూ ఉన్నాయి. ఇక గత ప్రభుత్వంలో వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులపై కూడా విచారణ జరగనున్నట్టు తెలుస్తోంది.





19న శ్రీసిటీకి సీఎం చంద్రబాబు

రేపు షార్‌కు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాక

తడ, ఆగస్టు 11: ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈనెలలో జిల్లాలో విడివిడిగా పర్యటించనున్నారు. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో మంగళవారం జరగనున్న అంతరిక్ష దినోత్సవాల్లో పాల్గొనడానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రానున్నారు. తిరుపతి విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చి అక్కడినుంచి హెలికాప్టర్‌లో శ్రీహరికోటకు చేరుకుంటారు. అక్కడ జరిగే కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి హెలికాప్టర్‌లో విమానాశ్రయానికి చేరుకుంటారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల 19వ తేదీన శ్రీసిటీకి రానున్నారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆహ్వానం మేరకు ఆయన సెజ్‌లో పర్యటించేందుకు సమ్మతించారు. ఆ రోజంతా ఆయన శ్రీసిటీలోనే ఉండనున్నట్లుగా సమాచారం. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి జిల్లాకు రానుండటంతో అధికారులు భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. వీరి పర్యటనకు సంబంధించి అధికారిక సమాచారం అందిందని.. ఏర్పాట్లు చేస్తున్నామని సూళ్లూరుపేట ఇన్‌చార్జి ఆర్డీవో కిరణ్‌కుమార్ తెలిపారు.

నేటినుంచి హర్ ఘర్ తిరంగా

తిరుపతి (విద్య), ఆగస్టు 11: ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని సోమవారం నుంచి ఈనెల 15వ తేదీ వరకు జిల్లాలో ఘనంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా, మండల, గ్రామ, వార్డు పరిధుల్లో హర్ ఘర్ తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. అర్బన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్లు, మండలాల్లో ఎంపీడీవోలు, గ్రామ పంచాయతీ పరిధిలో డీపీవో, స్పోర్ట్స్, ఎన్‌వైకే, విద్యాశాఖ పర్యవేక్షించాలి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో దేశభక్తి గీతాలు నిర్వహణ, పేట్రియాటిక్ డ్రామాలు, మోనో యాక్షన్ ప్రదర్శనలు తదితర కార్యక్రమాలను చేపట్టాలి. డీఆర్‌డీఏ, మెప్మా వారు ఎస్‌హెచ్‌జీ భాగస్వామ్యంతో జెండాల విక్రయాలతో స్టాల్స్‌ను నిర్వహించాలి. 13వ తేదీన డీఎస్‌డీవో, డీఈవో కలిసి సమన్వయంతో బిగ్‌రన్ మారథాన్ నిర్వహించాలి. 14న జాతీయ జెండాలతో 'హర్‌ఘర్‌తిరంగా.కామ్' లింక్ ద్వారా సెల్ఫీలు తీసుకుని పోస్ట్ చేయాలి. మున్సిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధులు, వారి కుటుంబీకులను గౌరవించాలి. 15వ తేదీన జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో జాతీయ జెండాను ఎగురవేయాలి' అని కలెక్టర్ ఆదేశాలిచ్చారు. అన్నిశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

20నుంచి ఓటర్ల జాబితా సవరణ షురూ

● ఓటరుగా నమోదుకు యువతకు అవకాశం

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 11: జిల్లాలో ఈనెల 20వ తేదీ నుంచి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. అలాగే 18-19 సంవత్సరాల యువతను కొత్త ఓటరుగా నమోదుకు భారత ఎన్నికల కమిషన్ అవకాశమిచ్చింది. ఈనెల 20 నుంచి అక్టోబరు 18వ తేదీ నాటికి సవరణ ప్రక్రియ పూర్తి చేసి, అదేనెల 29న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సమాచారాన్ని ధ్రువీకరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఓటర్ల జాబితాల్లో పొరపాట్లను గుర్తించి తొలగించడం, ఫొటోల నాణ్యతను మెరుగుపరచడం, పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ చేయనున్నారు. అక్టోబరు 19 నుంచి 28వ తేదీవరకు 1 నుంచి 8 వరకు ఫారాల తయారీతో పాటు వచ్చే ఏడాది జనవరి ఒకటోతేదీ నాటికి సమగ్రమైన డ్రాఫ్ట్ రోల్స్ సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అలాగే ముసాయిదా ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు, ఇతర క్లెయిమ్‌లు నవంబరు 28వ తేదీ వరకు స్వీకరిస్తారు. ఈ ఏడాది డిసెంబరు 24వ తేదీ నాటికి అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాను వచ్చే ఏడాది జనవరి 6న ప్రచురించనున్నారు.

ఈసారైనా దొంగ ఓట్లను తొలగిస్తారా..?

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వైసీపీ బరితెగించి బీఎల్వోలు, ఇతర అధికారుల సహకారంతో ఇబ్బడి ముబ్బడిగా దొంగ ఓట్లను చేర్పించడం, డెడ్, షిఫ్టెడ్ ఓట్లను తొలగించలేదన్న విమర్శలు వచ్చాయి. అప్పట్లో ఈ అంశాలపై కూటమి నేతలు కేంద్ర ఎన్నికల సంఘానికి పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. ఈ నేపథ్యంలో ఈనెల 20 నుంచి చేపట్టబోయే ప్రక్రియలోనైనా దొంగ ఓట్లను తొలగించాలని వారు కోరుతున్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో పోలింగ్ సమయానికి మొత్తం 18,12,980మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 8,83,330 మంది, మహిళలు 9,29,466మంది,ఇతరులు 184మంది ఉన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా ఓటర్ల సవరణ ప్రక్రియ నిర్వహిస్తే ఓటర్ల సంఖ్య తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా చంద్రగిరి, తిరుపతిలో అత్యధికంగా దొంగ ఓట్లు నమోదైన విషయం బహిరంగ రహస్యమే. ఈ విషయాలపై కలెక్టర్ వెంకటేశ్వర్ దృష్టి సారించాల్సి ఉంది.

ఆ హాట్ సీట్లపైనే పలువురు సీఐల ఆసక్తి

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: జిల్లాలో సీఐల బదిలీలు రెండుసార్లు జరిగినా కొన్ని స్థానాలపై పలువురు సీఐలు ఆసక్తి చూపుతున్నారు. వీటిల్లో తిరుపతి ఈస్ట్, తిరుమల వన్‌టౌన్, టూటౌన్, తిరుపతి వెస్ట్, చంద్రగిరి, పాకాల, భాకరాపేట సర్కిళ్లను హాట్ సీట్లుగా పోలీసు వర్గాలు భావిస్తుంటాయి. వీటిల్లో ఒక్కో సర్కిల్‌కి దాదాపు నలుగురు చొప్పున పోటీపడుతున్నట్లు సమాచారం. అత్యంత డిమాండు ఉన్నది ఈస్ట్ సర్కిల్. దీని పరిధి కూడా ఎక్కువే. పైగా విద్య, వైద్యంతోపాటు వ్యాపార కేంద్రం కూడా కావడంతో పోటీ ఎక్కువగా ఉంది. తిరుమలకూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇక్కడా పోటీ తీవ్రంగా ఉంది. ఈ నేపథ్యంలో ఎవరికి పోస్టింగ్ ఇవ్వాలన్న దానిపై అధికారులకు తలనొప్పిగా మారింది. కాగా, అనధికార సమాచారం మేరకు.. తిరుపతిలోని ఎస్వీయూనివర్సిటీ సీఐగా పనిచేస్తున్న మురళీమోహన్‌కు తిరుమల టూటౌన్ ఖరారైనట్లు తెలుస్తోంది. కొండపై వన్‌టౌన్ సీఐగా ఉన్న విజయకుమార్‌కు బదిలీ లేనట్లు సమాచారం.

వీఆర్వోల ప్రైవేట్ గదుల్లో రెవెన్యూ రికార్డులు

● వాటి భద్రతపై అనుమానాలు ● రేణిగుంట విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ల రూటే సపరేటు

తిరుపతి- ఆంధ్రజ్యోతి



రేణిగుంటలోని వీఆర్వోల ప్రైవేట్ కార్యాలయంలో ఉన్న రికార్డులు

రేణిగుంట మండల పరిధిలోని వీఆర్వో (విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్)ల వ్యవహారశైలిపై విమర్శలు వస్తున్నాయి. తహసీల్దార్ కార్యాలయం కాదని సొంతంగా అద్దె గదులను తీసుకుని ఎక్కువ సమయం అక్కడే ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక వారి పంచాయతీకి సంబంధించిన రెవెన్యూ రికార్డులను అక్కడే ఉంచుకున్నట్టు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులకు ఖాళీగా ఉన్న రెవెన్యూ, వివాదాస్పద భూముల పత్రాలను చూపించి వారి కబ్జాకు సహకరించారన్న ప్రచారం జరుగుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూడా ప్రైవేట్ గదులను వదిలి పెట్టడంలేదని తెలుస్తోంది. సోమవారం మాత్రం ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమయంలో ఓ గంటపాటు ఉండి తక్కిన సమయం ఆ గదుల్లోనే ఉంటూ సేద తీరుతుంటారని సమాచారం. వారికోసం ఎవరొచ్చినా తహసీల్దార్ కార్యాలయం కాకుండా సొంత కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. తొలుత అక్కడ 'సెటిల్' చేసుకుంటేనే తహసీల్దార్ కార్యాలయం వరకు ఫైలు కదులుతుందన్న ఆరోపణలు పెద్దఎత్తున ఉన్నాయి. ఇవి అటుంచితే రెవెన్యూ రికార్డుల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రైవేట్ గదుల్లో ఎక్కడపడితే అక్కడ రికార్డులు, పత్రాలు పడి ఉన్నాయి. ముఖ్యమైన రికార్డులు కనిపించకపోయినా, ఎవరైనా అపహరించినా బాధ్యత ఎవరిదంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

● కుప్పం మహిళా రైతు

'ఎర్రకోట' వేడుకలకు అతిథి



విజయవాడ బయలుదేరిన మునిలక్ష్మి దంపతులు

ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే పంద్రాగస్టు వేడుకలకు కుప్పం మహిళా రైతు ఎస్.మునిలక్ష్మి అతిథిగా హాజరు కానున్నారు. కుప్పం మండలం వెండుగంపల్లెకు చెందిన ఈమె పీఎం కిసాన్ పథకం లబ్ధిదారు. తన భర్త నారాయణతో కలిసి గ్రామంలో ఆమె ఆదర్శ వ్యవసాయం చేస్తున్నారు. కాగా, ఢిల్లీలో జరిగే స్వాతంత్ర్యదిన వేడుకలకు రాష్ట్రం నుంచి పీఎం కిసాన్ లబ్ధిదారులైన నలుగురు రైతులను అతిథులుగా ఎంపిక చేశారు. వీరిలో చిత్తూరు ఉమ్మడి జిల్లా నుంచి మునిలక్ష్మి ఉన్నారు. మిగిలిన వారు.. పోతుల నాగమణి (ఏలూరు), దోమ మోహన్ (శ్రీకాకుళం), నల్లపు మాల్యాద్రి (ప్రకాశం). కాగా ఎస్.మునిలక్ష్మి దంపతులు ఆదివారం సాయంత్రం కుప్పంనుంచి విజయవాడ బయలుదేరి వెళ్లారు. అక్కడ్నుంచి దురంతో ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి న్యూఢిల్లీ చేరుకుంటారు. ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో అతిథిగా పాల్గొంటారు. మునిలక్ష్మి దంపతులకు టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు మల్లానూరు ప్రేమ్‌కుమార్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

- కుప్పం



శ్రీవారి పుష్కరిణికి జోరుగా మరమ్మతులు

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారి పుష్కరిణికి ఈనెల ఒకటో తేదీన మొదలైన మరమ్మతులు ప్రస్తుతం జోరుగా జరుగుతున్నాయి. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాలకు ముందు పుష్కరిణికి మరమ్మతులను చేసి.. తిరిగి నీటిని నింపడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈనెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు పుష్కరిణిని మూసివేసి మరమ్మతులు చేయాలని టీటీడీ నిర్ణయించింది. దాంతో ఒకటో తేదీనుంచి పుష్కరిణిలోకి భక్తుల అనుమతిని రద్దు చేసి.. ఉన్న నీటిని తోడే పనులను మొదలు పెట్టారు. ప్రస్తుతం నీటి మొత్తాన్ని తోడేశారు. పలుచోట్ల పగుళ్లు వచ్చిన పైపులకు మరమ్మతులు చేశారు. పూడికను శుభ్రం చేయడంతో మొదటి దశ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. రానున్న పదిరోజుల్లో మరమ్మతులన్నీ పూర్తిచేసి పెయింట్ వేయనున్నారు. చివరి పదిరోజులు మూడో దశలో తిరిగి పరిశుభ్ర నీటిని నింపి.. పుష్కరిణిని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. సెప్టెంబరు ఒకటో తేదీ నుంచి భక్తులను పుష్కరిణిలోకి అనుమతిస్తారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి


మునిరత్నంనగర్ కాలనీవాసులకు సూచనలిస్తున్న డీఎస్పీ

నాయుడుపేట టౌన్, ఆగస్టు 11: గంజాయి, మద్యం వంటి మత్తుప దార్థాలకు యువత దూరంగా ఉండాలని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సూచించారు. పట్టణంలోని మునిరత్నంనగర్ కాలనీలో ఆదివారం తెల్లవారు జామున కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. కాలనీలో మోటర్ సైకిళ్ల పత్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ... కాలనీలో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. సీఐ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ... మద్యం తాగి వాహనాలను నడపరాదని, అలా నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గోపి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అర్బన్, రూరల్ సీఐలు


సంఘుమేశ్వర రావు - బాజీ

నాయుడుపేట, ఆగస్టు 11: నాయుడుపేట అర్బన్ సీఐగా బాజీ, రూరల్ సీఐగా సంఘుమేశ్వర రావు బాధ్యతలు స్వీకరించారు. ఆదివారం వారి వారి కార్యాలయాల్లో పూజలు నిర్వహించి బాధ్యతలు చేపట్టారు. అర్బన్ సీఐ బాజీ నెల్లూరు టూ టౌన్‌లో పనిచేస్తూ బదిలీపై నా యుడుపేట అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. అలాగే రూరల్ సీఐ సంఘుమేశ్వర రావు వెంకటగిరిలో పనిచేస్తూ బదిలీపై నాయుడుపేట రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టారు.

బదిలీపై వెళ్తున్న సీఐకి సన్మానం



నాయుడుపేట టౌన్, ఆగస్టు 11 : నాయుడుపేట అర్బన్ సీఐగా పనిచేస్తూ బదిలీపై వెళ్తున్న శ్రీనివాసులురెడ్డిని శాలువా కప్పి సన్మానించారు. ఆదివారం సర్కిల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన అర్బన్ సీఐ బాజీ, ఎస్ఐ గోపీ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

డీఎస్పీగా రమణకుమార్ బాధ్యతల స్వీకారం


డీఎస్పీ వి.వి.రమణకుమార్

గూడూరు, ఆగస్టు 11: డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడుతానని డీఎస్పీ వి.వి.రమణకుమార్ అన్నారు. ఆదివారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేరాల నియంత్రణకు పోలీసులు నిరంతరం పనిచేస్తూ ఉంటారన్నారు. బేసిక్ పోలీసింగ్‌కు ప్రాధాన్యం ఇస్తామన్నారు. పోలీసులు యూనిఫాం ధరించి రోడ్లపై తిరుగుతుంటే నేరాలు తగ్గుముఖం పడుతాయన్నారు. ప్రధానంగా గంజాయి అక్రమ రవాణాను అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎవరిని ఉపేక్షించేది లేదన్నారు. అనంతరం డివిజన్ పరిధిలోని పలువురు సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది డీఎస్పీని కలసి శుభాకాంక్షలు తెలిపారు.

గూడూరు పట్టణ సీఐగా శేఖర్‌బాబు ...



గూడూరు, ఆగస్టు 11: ఒకటో పట్టణ సీఐగా శేఖర్‌బాబు ఆదివారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తుండిన సీఐ పాపారావు బదిలీపై గుంటూరుకు వెళ్లడంతో ఆయన స్థానంలో గుంటూరు వీఆర్‌నుంచి వచ్చిన శేఖర్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పట్టణంలో ట్రాఫిక్ సమస్యను నియంత్రించేందుకు చర్యలు చేపడుతామన్నారు. నేర నియంత్రణకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం పలువురు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వెంకటగిరి సీఐగా రమణ...



వెంకటగిరిటౌన్, ఆగస్టు 11: వెంకటగిరి సీఐగా ఏవీ రమణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఒంగోలు డీసీ కార్యాలయంలో పనిచేశారు. రెగ్యులర్ బదిలీల్లో భాగంగా వెంకటగిరికి వచ్చారు.

వాకాడు సీఐగా ....


హుస్సేన్‌బాషా

వాకాడు, ఆగస్టు 11: వాకాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా హెచ్‌ఎస్ హుస్సేన్‌బాషా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు సోషల్ మీడియా, సైబర్ క్రైం సెల్‌లో ఉన్న ఆయన సాధారణ బదిలీల్లో వాకాడు సీఐగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐకు పలువురు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ చెప్పారు.

సర్పంచ్‌లకు మూడు రోజుల పాటు శిక్షణ

చిట్టమూరు, ఆగస్టు 11: మండలంలోని 23 మంది సర్పంచులు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీవో సాలెడ్ తెలిపారు. కెపాసిటీ బిల్డింగ్, ఆర్జీఎస్‌ఏ, జీపీడీపీలపై ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ ఇస్తారని తెలిపారు. ఈ శిక్షణలకు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరు కావాలని తెలిపారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ఇక ప్రగతి బాటలో గ్రామాలు

- ఉపాధి హామీ నిధుల తోడ్పాటు
- సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణాలు
- కూటమి ప్రభుత్వం రాకతో మౌలిక వసతుల కల్పనకు కృషి

సూళ్లూరుపేట, ఆగస్టు 11: పల్లెలు ప్రగతి బాట పట్టాలంటే మౌలిక వసతుల కల్పన ముఖ్యం. వీటిలో రోడ్లు, కాలువలు ప్రధానమైనవి. ఈ కారణంగా టీడీపీ హయాంలో ఉపాధి హామీ నిధులతో ఆయా పనులకు ప్రాధాన్యమిచ్చారు. దాదాపు అన్ని గ్రామాల్లో ప్రధాన మార్గాలను సిమెంట్ రోడ్లుగా తీర్చిదిద్దారు. తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని విస్మరించడంతో పాటు.. ఆర్థిక సంఘ నిధులనూ పక్కదారి పట్టించడంతో గ్రామీణ ప్రగతి పడకేసింది.

స్థానికంగా పనులు...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో కూలీలకు స్థానికంగా పనులు కల్పించడంతోపాటు పంచాయతీలకు ఆస్తులు ఉండాలన్న ఉద్దేశంతో.. ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణం చేపట్టింది అప్పట్లో 70 శాతం మెటీరియల్, మరో 30 శాతం నిధులు పంచాయతీల నుంచి వెచ్చించేవారు. ఆ తరువాత 50 శాతం మెటీరియల్, మిగతా యాభై శాతం స్పెషల్ డెవలెప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కేటాయించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎస్‌డీఎఫ్ నిధుల ఊసేలేదు. టీడీపీ హయాంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఎంత మొత్తం నిధులు ఖర్చు చేశారో.. అందులో నలభై శాతం నిధులు మెటీరియల్ కాంపోనెంట్ కింద సమకూరేవి. పల్లె రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యమిచ్చి ఆ మొత్తం ఖర్చు చేశారు. తరువాతి ప్రాధాన్యంగా పంచాయతీ భవనాలు, శ్మశాన వాటికల అభివృద్ధి, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలకు ప్రహరీ, రైతు బజార్లు, తీర ప్రాంత గ్రామాల్లో చేపల మార్కెట్ నిర్మాణం వంటివి చేపట్టారు.


గత టీడీపీ హయాంలో కేసియన్‌గుంటలో నిర్మించిన సిమెంటు రోడ్డు

ఆర్థిక సంఘం నిధులూ లాగేసుకుని..

వైసీపీ ప్రభుత్వం వచ్చాక పల్లె ప్రగతి పడకేసింది. పంచాయతీలకు కేంద్రం నుంచి వచ్చిన 14, 15వ ఆర్థిక సంఘం నిధులను సైతం లాగేసుకుంది. విద్యుత్ బిల్లుల బకాయిల కింద జమ చేసుకోవడంతో ఖాతాలు ఖాళీ అయ్యాయి. కొన్ని పంచాయతీల్లో పారిశుధ్య పనులూ నిర్వహించలేని పరిస్థితుల్లో కొందరూ సర్పంచులే సొంత నిధులు వెచ్చించిన ఘటనలున్నాయి. వైసీపీ హయాంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున కేటాయించారు. పలు చోట్ల అంతర్గత రోడ్ల నిర్మాణానికి ఆ నిధులు కేటాయించినా.. బిల్లులు రావన్న భయంతో పనులు చేపట్టేందుకు ఆ పార్టీ నాయకుల సైతం అనాసక్తి చూపారు.

కూటమి ప్రభుత్వం రాకతో...

వైసీపీ ఐదేళ్ల పాలనలో పడేసిన పల్లె ప్రగతిని మళ్లీ పట్టాలెక్కించడానికి కూటమి ప్రభుత్వం ప్రణాళికలు రచించింది. గ్రామాల వీధుల్లో మురుగు లేకుండా, మట్టి రోడ్డు లేని పల్లెలుగా చేయాలనే ఉద్దేశంతో మళ్లీ పల్లెలకు మహర్దశ పట్టనుంది. ఉపాధి హామీ నిధులతో పల్లెల్లో సిమెంటు రోడ్ల నిర్మాణంతోపాటూ పారిశుధ్యం తదితర అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం సూళ్లూరుపేట నియోజకవర్గంలో తొలి విడతగా రూ.12 కోట్లు మంజూరు చేశారు. ప్రతి మండలానికి రూ.2 కోట్లు కేటాయించారు. నియోజకవర్గంలో 6 మండలాల్లో 127 పంచాయతీలు న్నాయి. ఇక ఈ పంచాయతీల్లో మట్టి రోడ్లు సిమెంటు రోడ్లుగా మారి మురుగునీరు నిల్వలేకుండా పల్లెలు సుందరంగా దర్శనమివ్వనున్నాయి. గడిచిన ఐదేళ్లలో వీధి లైట్ పోతే వేసుకోలేని పరిస్థితి. కరెంట్ బిల్లులు చెల్లించలేని దుస్థితి. ప్రస్తుతం నిధులు కేటాయించడంతో రూపురేఖలు మారనున్నాయి.

ఊపందుకున్న వరి కోతలు

- ఖరీఫ్‌లో 2 వేల ఎకరాల్లో వరిసాగు
- పెరిగిన పెట్టుబడులు
- తగ్గిన దిగుబడులు.. తప్పని నష్టాలు

పెళ్లకూరు, ఆగస్టు 11 : ఈ ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 2 వేల ఎకరాలకు పైగా రైతులు వరి సాగు చేపట్టారు. అడపాదడపా కురిసిన వర్షాలతో పాటు బోర్ల కింద ఎంటీయూ 1010 రకం సాగు చేశారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో వరికోతలు ఊపందుకున్నాయి. అయితే ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది పంటను చీడపీడలు ఆశించడంతో దిగుబడులు గణనీయంగా తగ్గాయి. గతేడాది ఇదే సీజన్‌లో ఎరకానికి 40 నుంచి 45 బస్తాలు దిగుబడులు రాగా ఈ ఏడాది 30 నుంచి 35 బస్తాలే వస్తున్నాయి.

పెరిగిన పెట్టుబడి...

వాస్తవానికి ఖరీఫ్‌లో సాగుచేసే వరికి చీడపీడల ఆశించే పరిస్థితి చాల తక్కువ. దుక్కినుంచి కోతల వరకు ఎరకానికి సుమారు రూ.35 వేలు ఖర్చు అవుతాయి. అలాంటిది ఈ ఏడాది చీడపీడలు ఆశించడంతో పెట్టుబడులు పెరిగి దిగుబడులు తగ్గడం రైతులను నిరాశ పరిచింది. ఇదిలా ఉండగా కోతలు ఊపందుకున్న నేపథ్యంలో దళారులు, వ్యాపారులు, మిల్లర్లు కుమ్మక్కై ధరలు పెరగకుండా చూసుకుంటున్నారు. ఎంటీయూ 1010 రకం ధాన్యం ధర గతేడాది రూ.1550 వరకు పలికింది. ప్రస్తుతం రూ.1480 ఉన్న ధర నేడు రూ.1440కి చేరింది. దీనికి తోడు 75 కిలోల బస్తాకి నెమ్ము పేరుతో మూడు కిలోలు, గోనెసంచికి కిలో, రివాజు పేరుతో అర కిలో కలిపి మొత్తం నాలుగన్నర కిలోలు తగ్గిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యానికి ఆశించిన స్థాయిలో ధరలు లేకపోవడంతో పెట్టుబడులు సైతం రాక రైతులు నష్టాలు పాలవుతున్నారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించి సిండికేట్‌లపై చర్యలు తీసుకుని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


చిల్లకూరులో పంట కోస్తున్న వరి కోత యంత్రం

అన్న క్యాంటీన్‌కు విరాళం


ఎమ్మెల్యేకు విరాళం అందిస్తున్న వెంకటేశ్వర్లు

వెంకటగిరి టౌన్, ఆగస్టు 11: అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళం అందింది. ఈనెల 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లను సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ప్రారంభించ నున్న విషయం విదితమే. ఇందులో భాగంగా వెంకటగిరి పట్టణానికి చెందిన అప్పెన వెంకటేశ్వర్లు అన్న క్యాంటీన్ నిర్వహణకు ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణకు రూ.10116 చెక్కును అందించారు. అన్న క్యాంటీన్‌లో ఎంతో మంది పేదవారు కడుపు నింపుకునే వారని, గత ప్రభుత్వం వాటిని మూసివేయడం దుర్మార్గమని వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు.

లైబ్రరీలు మానసిక వికాసానికి సోపానాలు


విద్యార్థులతో ముఖాముఖిలో ఎంఈవో

వెంకటగిరిటౌన్, ఆగస్టు 11: గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి సోపానాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో ఆయన విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలతో మానసిక వికాసం, క్రమశిక్షణ, మౌనపఠనం, జ్ఞాపకశక్తి, నైపుణ్యాలు అలవడుతాయన్నారు. లైబ్రరీకి వచ్చే ప్రతి విద్యార్థీ పోటీ పరీక్షలకు హాజరు కావాలని కోరారు.

తిరుపతినుంచి పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), ఆగస్టు 11: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా తిరుపతి నుంచి ఐదు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ తెలిపారు. ఈ నెల 14న తిరుపతి - నాగర్‌సోల్‌ల మధ్య ప్రత్యేక రైలు(07417) ఉదయం 8.15 గంటలకు బయలుదేరి రేణిగుంట, కోడూరు, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, ముద్దనూరు, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూర్, యాదగిరి, చిట్టపూర్, తాండూర్, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, నాందేడ్, పూర్ణా, పర్భాని, సెలు, పార్టూర్, జాల్నా, ఔరంగాబాద్‌ల మీదుగా మరుసటిరోజు ఉదయం 10 గంలకు నాగర్‌సోల్‌కు చేరుకొంటుంది. నాగర్‌సోల్‌లో ఈ ప్రత్యేక రైలు(07418) 15వ తేది రాత్రి 10 గంటలకు బయలుదేరి, వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. అదేవిధంగా తిరుపతి - సికింద్రాబాదు మధ్య 17వ తేది ప్రత్యేక రైలు(07489) సాయంత్రం 5.15 గంటలకు బయలుదేరి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ మార్గంలో ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 7.25 గంటలకు సికింద్రాబాదుకు చేరుకొంటుంది. సికింద్రాబాదులో ఈ ప్రత్యేక రైలు(07490) 18వ తేది సాయంత్రం 6.10 గంటలకు బయలుదేరి వెళ్లిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు ఉదయం 9.15 గంటలకు తిరుపతికి చేరుకొంటుంది. అలాగే తిరుపతి నుంచి నాందేడ్‌కు 19వతేది సాయంత్రం 5.15 గంటలకు ప్రత్యేక రైలు(07417) బయలుదేరి రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, ఆదోని, మంత్రాలయంరోడ్డు, రాయచూర్, క్రిష్ణ, యాదగిరి, తాండూరు, వికారాబాద్, లింగంపల్లి, సికింద్రాబాదు, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్, ముడికేడ్ స్టేషన్లలో ఆగుతూ మరుసటి రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు నాందేడ్‌కు చేరుకుంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సీపీఆర్‌వో విజ్ఞప్తి చేశారు.

నిర్వీర్యమైన చెత్తనుంచి సంపద కేంద్రాలు

పట్టించుకోని అధికారులు ● నిష్ఫలమైన కోట్లాది రూపాయలు


నిరుపయోగంగా మానమాల చెత్తనుంచి సంపద కేంద్రం

ఓజిలి, ఆగస్టు 11 : చెత్తనుంచి సంపద అనే నినాదంతో ఏర్పాటైన కేంద్రాలు నిర్వీర్యమై పోయాయి. దీంతో కోట్లాది రూపాయల నిధులు నిష్ఫలమయ్యాయి. సూళ్లూరుపేట నియోజకవర్గంలో 100కు పైగా చెత్తనుంచి సంపద కేంద్రాలు ఉన్నాయి. ఈక్రమంలో ఒక్కో కేంద్రం నిర్మాణం కోసం రూ.3.5 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు నిధులను వెచ్చించి నిర్మించారు. 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చెత్తనుంచి సంపద కేంద్రాలకు బీజం పడింది. ఓ వైపు పారిశుధ్య సమస్య పరిష్కారంలో భాగంగా సేకరించిన తడి, పొడి చెత్తనుంచి సంపద సృష్టించేందుకు సంకల్పించిన ఈ పథకం పలు గ్రామాల్లో చెత్త సమస్యకు పరిష్కారం చూపుతున్న తరుణంలో ప్రభుత్వం మారడంతో మొదటికి వచ్చింది. అప్పట్లో ఉపాధి హామీ పథం కింద నిధులను వ్యయం చేసి ఈ కేంద్రాల నిర్మాణం జరిగింది. ఓజిలి మండలంలోని 26 పంచాయతీల్లో 17 చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్మాణం పూర్తి చేశారు. మరో 7 పంచాయతీలలో వీటి నిర్మాణం వివిధ దశల్లో ఉంది. కాగా మండలంలోని తిరుమలపూడి, గ్రద్దగుంట పంచాయతీలలో వీటి నిర్మాణం చేట్టలేదు.

గ్రామాలను వీడని చెత్త సమస్య...

కేంద్ర ప్రభుత్వ నిధులను సద్వినియోగం చేసుకుని ఎంతో ఉన్నతాశయంతో ప్రారంభమైన ఈ పథకం టీడీపీ ప్రభుత్వం మారడంతో 2019-24 మధ్యకాలంలో పూర్తిగా నిర్వీర్యమైపోయింది. అటు ప్రభుత్వం, ఇటు అధికారులు ఈ కేంద్రాలను పట్టించుకోలేదు. టీడీపీ హయాంలో గ్రామాల్లో చెత్త సేకరణ కోసం నియమించిన గ్రీన్ అంబాసిడర్లను సైతం వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. దీంతోపాటు పంచాయతీలకు మంజూరైన నిధులను సర్పంచుల ప్రమేయం లేకుండా వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించడంతో పారిశుధ్యం సమస్య జటిలంగా మారింది. ఈ కేంద్రాల ద్వారా సంపద సృష్టించే మాట ఎలా ఉన్నా ప్రస్తుతం ఇవి అసాంఘిక కార్యకలాపాలకు చక్కగా ఉపయోగపడుతున్నాయి. మూలన పడిపోయిన ఈ సంపద కేంద్రాలపై టీడీపీ ప్రభుత్వం దృష్టి సారించి తిరిగి వినియోగంలోని తీసుకురావాల్సి ఉంది.

నిమ్మ మార్కెట్ అభివృద్ధికి కృషి

ఎమ్మెల్యే పాశిం


విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 11: గూడూరు నిమ్మ మార్కెట్ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం బాలాజీ నిమ్మ మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన నిమ్మ ముఠా కార్మికుల విశ్రాంతి భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడూరు నిమ్మ మార్కెట్‌కు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. ఇక్కడి నుంచి నిమ్మకాయలు పలు రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయన్నారు. నిమ్మ మార్కెట్‌లో పని చేసే కార్మికులు కోసం విశ్రాంతి భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నిమ్మ మార్కెట్‌కు ప్రభుత్వం ద్వారా ఎటువంటి సాయం కావాలన్నా అంది స్తానన్నారు. కార్యక్రమంలో సిద్దారెడ్డి, మస్తాన్‌నాయుడు, మీరారెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, చెంచురామయ్య, నాగరాజు, శ్రీహరి నాయుడు, రామానాయుడు, ఇశ్రాయేల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంకాళ పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠాపన

కోట, ఆగస్టు 11: పట్టణ పరిధిలోని శ్యామ సుం దరపురం గ్రామ దేవత అంకాళమ్మ పరమేశ్వరి ఆలయ మహాకుంభాభిషేకంలో భాగంగా ఆదివా రం అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన శాస్త్రోక్తంగా జ రిగింది. అంతకు ముందు మేళతాళాల మధ్య, వేదమంత్రోచ్ఛటనల నడుమ అమ్మవారి విగ్ర హాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా అన్నదానం జరిగింది. ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

సేవా కార్యక్రమాలు అభినందనీయం

గూడూరు అర్బన్, ఆగస్టు 11: సిరామిక్ యూత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని సీడీపీవో మెహబూబీ అన్నారు. ఆదివారం స్థానిక సిరామిక్ రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో ట్రస్ట్ వార్షికోత్సవం సందర్భంగా కుర్చీలు, వాటర్‌క్యాన్లు అందజేశారు. అనంతరం స్థానిక ఏరియా ఆసుపత్రిలో గర్భిణులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గిరిజా, హైమావతి, జోష్న, సుప్రియ, ట్రస్ట్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని పారిశుధ్య కార్మికుడి మృతి

తడ, ఆగస్టు 11: బైక్ ఢీకొని పారిశుధ్య కార్మికుడు మృతి చెందాడు. మండల పరిధిలోని రామాపురం పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పని చేసే ఏ.మునస్వామి(25) ఆదివారం రాత్రి సొంత పనిమీద జాతీయ రహదారి వద్దకొచ్చాడు. అక్కడ పని ముగించుకొని తిరిగి వెళ్లే క్రమంలో తడ వైపు వెళ్తున్న బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో మునస్వామి రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ట్రాక్టర్

- స్కూటరిస్టు మృతి


మస్తాన్ మృతదేహం

తడ, ఆగస్టు 11: ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని భీములవారిపాళేనికి చెందిన టి.మస్తాన్ (25) శ్రీసిటీ సెజ్‌లో పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి సూళ్లూరుపేటలో పెళ్లికి వెళ్లేందుకు తన స్నేహితుడు పెరియవట్టుకుప్పానికి చెందిన షాదిక్‌తో కలసి ద్విచక్రవాహనంపై వెళ్లారు. మార్గమధ్యంలో పులివేంద్ర సమీపంలోని జాతీయ రహదారి మలుపు వద్ద ట్రాక్టర్ దూసుకువచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈప్రమాదంలో మస్తాన్ అక్కడికక్కడే మృతి చెందగా షాదిక్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు సమాచారం మేరుకు 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం అతన్ని చెన్నైకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రమేష్ చంద్రప్రసాద్‌కు పలువురి నివాళి


రమేష్ చంద్రప్రసాద్‌కు పుష్పాంజలి ఘటిస్తున్న గాలి భానుప్రకాష్

నింద్ర, ఆగస్టు 11: ఉమ్మడి చిత్తూరు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు గంధమనేని రమేష్‌చంద్ర ప్రసాద్‌కు పలువురు నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఆయన స్వగ్రామమైన నింద్ర మండలం ఉరూరుపేటలో ఆదివారం కర్మక్రియలు జరిగాయి. ఈ సందర్భంగా సంతాప సభ నిర్వహించారు. టీడీపీకి రమేష్‌చంద్ర ప్రసాద్ చేసిన సేవలను పలువురు ఎమ్మెల్యేలు, నేతలు గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. ఆయనకు పుష్పాంజలి ఘటించిన వారిలో మాజీ మంత్రి కరణం బలరాం, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు, గౌనివారి శ్రీనివాసులు, జయచంద్రనాయుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, నేతలు ఎస్సీవి నాయుడు, నేతలు చంద్రప్రకాష్, అశోక్‌రాజు, ఆర్సీ మునికృష్ణ, ఎంఎం రాధాకృష్ణ, చినబాబు, ప్రకాష్‌నాయుడు, పాకారాజా, వెంకటేశ్వరరావు, ధనంజయనాయుడు, దశరధవాసు, గాలి రమేష్‌నాయుడు, ఢిల్లీబాబు, గంగాధరం నాయుడు, ధనంజయయాదవ్, ధనంజయనాయుడు, లక్ష్మీపతిరాజు, గిరి, మురళీనాయుడు, రవికుమార్, గిరిబాబు, శివక్రిష్ణమనాయుడు, పీఎస్. రాధాకృష్ణ, గజేంద్రనాయుడు, చంద్ర, రమేష్, గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో

ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా: టీడీపీ

చిట్టమూరు, ఆగస్టు 11: గత స్థానిక సంస్థ ఎన్నికల్లో వైసీపీకి ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా అని తిరుపతి పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కమిటీ సభ్యుడు ఎన్‌ఆర్ఐ కృష్ణ ప్రశ్నించారు. సోషల్ మీడియాలో వైసీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి చేస్తున్న ప్రకటనలపై ఆయన ఆదివారం స్పందించారు. ఈనెల 8న జరిగిన విద్యా కమిటీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యాన్ని టీడీపీ ఖూనీ చేసిందన్న ఆయన ప్రకనటను ఖండించారు. విద్యా కమిటీ ఎన్నికల్లో విద్యార్థుల తల్లిదండ్రులను టీడీపీకి మద్దతు పలకుండా చేసి ప్రలోభపెట్టాలని చూసిన వైసీపీకి తగిన స్థాయిలో బుద్ధి చెప్పారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ సానుభూతిపరులను భయపెట్టి పోటీ చేయకుండా చేసిన నైజం వైసీపీది కాదా అన్నారు. తాను చిట్టమూరు మండల జట్పీటీసీగా పోటీ చేస్తే తనకు కరోనా వచ్చిందని, ఆస్ట్రేలియాకు తిరిగి పంపేందుకు చేసిన ప్రయత్నాలు మరచిపోయారా అని ప్రశ్నించారు. కుట్రలు, కుతంత్రాలు చేయడం వైసీపీకి వెన్నతో పెట్టిన విద్య అని, అందుకే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు చిత్తుచిత్తుగా ఓడించి 11 సీట్లిచ్చారన్నారు. ఎన్డీఏ కూటమిలో సీఎం చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

తాళమ్మకు ప్రత్యేక పూజలు



గూడూరు అర్బన్, ఆగస్టు 11: గూడూరు గ్రామదేవత తాళమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణ, సమీప ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టుకుని మొక్కులు తీర్చుకున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 11: తిరుపతి ఎస్వీయూనివర్సిటీ పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. వర్సిటీ సీఐ మురళీమోహన్ తెలిపిన వివరాలు... సుమారు 45 సంవత్సరాల వ్యక్తి గత కొంతకాలంగా తిరుపతి - చంద్రగిరి ఫ్లైఓవర్ సమీపంలో, విద్యానగర్ క్రాస్ వద్ద, స్థానిక పెట్రోలు బంకు వద్ద తచ్చాడుతుండే వాడన్నారు. ఆయన ఆదివారం మృతి చెందాడన్నారు. అతడి శరీరంపై ఎలాంటి గాయాలు లేవని, ఆరోగ్యం సరిగా లేక మృతి చెందాడా లేక అతిగా మద్యం తాగి మృతి చెందాడా అనే వివరాలు తెలియాల్సి ఉందన్నారు. మృతదేహంపై బ్లూరంగు షర్టు ఉండగా, దానిపై 984 గుడ్ అని ఇంగ్లీషులో రాసి వుంది. మృతుడి వివరాలు తెలిస్తే సెం.94910 74524కు అవసరమైన సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి రుయాకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.